STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/26/A3949

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 116 | ఎడిటర్ : అలీ ముర్తుజా | ఆదివారం 08 నవంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |



ఈ20 పెట్రోల్‌పై మోదీ సమాధానం చెప్పాల్సిందే!

నిర్దేశిత పరిమితికి మించి ఇథనాల్ కలుపుతున్నారంటూ రాహుల్ గాంధీ ఆరోపణలు

4

వాయుసేన రికార్డు!

13,629 అడుగుల ఎత్తులో భారీ రవాణా విమానం ల్యాండింగ్

నోమా వైమానిక స్థావరంలో చరిత్ర సృష్టించిన ఐఎల్-76ఎండీ

భారత వైమానిక దళం మరో అరుదైన ఘనత సాధించింది. సముద్ర మట్టానికి 13,629 అడుగుల ఎత్తులో భారీ రవాణా వి మానాన్ని విజయవంతంగా దింపి సరికొత్త చరిత్ర సృష్టించింది.



4



నిడదవోలులో వార్

వన్ సైడ్!

- పరిషత్ పోరులో కూటమి అఖండ విజయం
- 54 ఎంపీటీసీ, 3 జెడ్పీటీసీ స్థానాల కైవసం
- గెలిచిన అభ్యర్థులను సత్కరించిన మంత్రి

2



పల్లెల్లోనూ కూటమి ప్రభంజనం!

పరిషత్ ఎన్నికల్లో సత్తా చాటిన తెదేపా, జనసేన, భాజపా

రాష్ట్రవ్యాప్తంగా 7,219 ఎంపీటీసీలు, 491 జడ్పీటీసీలు కూటమి కైవసం

- 28కి 28 జిల్లా పరిషత్ పీఠాల్లో ఎన్డీఏ స్పష్టమైన ఆధిక్యం
- మొత్తం ఫలితాల్లో 73.73 శాతం స్థానాలు కూటమివే
- రాష్ట్రవ్యాప్తంగా 6 వేలకు పైగా ఎంపీటీసీలు గెలిచిన తెదేపా
- కడప జిల్లాలో బద్దలైన వైకాపా కంచుకోట
- భారీ మెజార్టీతో పులివెందుల, మైదుకూరు, రాజంపేట జడ్పీటీసీలను కొల్లగొట్టిన తెదేపా



అమరావతి, నవంబర్ 7 (సమయం న్యూస్) :సార్వత్రిక, మున్సిపల్ ఎన్నికల తరహాలోనే స్థానిక సంస్థల పరిషత్ పోరులోనూ ఎన్డీఏ కూటమి ప్రభంజనం సృష్టించింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ఎక్కడా ప్రతిపక్ష వైకాపాకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఏకపక్ష విజయాలతో సత్తా చాటింది. ఏకంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సొంత ఇలాకా పులివెందులతో సహా ఉమ్మడి కడప జిల్లాలో అఖండ విజయాలను నమోదు చేసి సంచలనం సృష్టించింది. గురువారం రాత్రి 11.44 గంటల సమయానికి అందిన అధికారిక సమాచారం ప్రకారం రాష్ట్రంలోని మొత్తం

మిగతా 2 లో

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్

రాష్ట్ర పారిశ్రామిక విధానాలకు ప్రపంచ గుర్తింపు తేవాలి



- యువత టాలెంట్‌కు అంతర్జాతీయ అవకాశాలు
- గ్రీన్ ఎనర్జీ, సెమీకండక్టర్ రంగాలపై విస్తృత ప్రచారం
- పారిశ్రామికవేత్తలకు పూర్తిస్థాయిలో భరోసా ఇవ్వండి
- సీఐఐ సదస్సు ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు సమీక్ష

2



ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా?

- ఎమ్మెల్సీ అప్పిరెడ్డి అరెస్టును ఖండించిన వైఎస్ జగన్

3

బాధితులకు అండగా నిలవండి!

- సహాయక చర్యలు వేగవంతం చేయాలని సీఎం ఆదేశం
- మురసు తుఫాన్ నష్టం, పునరావాసంపై ఉన్నతస్థాయి సమీక్ష
- పూర్తిస్థాయిలో సరుకులు అందించాలని స్పష్టీకరణ

2

అందుబాటు ధరల్లోకి బియ్యం

- వివిధ రకాల బియ్యం ధరలను నిర్ధారించిన ప్రభుత్వం
- నిత్యావసరాల ధరల నియంత్రణపై సీఎం చంద్రబాబు సమీక్ష

స్వచ్ఛతలో మనమే మేటి!



- ఏపీకి ఆరు ప్రతిష్ఠాత్మక స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు
- సత్తా చాటిన విజయవాడ, విశాఖ, గుంటూరు, తిరుపతి
- అవార్డుల జాబితాలో రాజమండ్రి, కుప్పం మున్సిపాలిటీ
- అన్ని పట్టణాలనూ డంపింగ్ యార్డ్ రహితంగా మారుస్తాం
- అధికారుల కృషిని కొనియాడిన మంత్రి నారాయణ
- ఈ నెల 11న న్యూఢిల్లీలో పురస్కారాల ప్రదానం

2



అహంకారం దరిచేరనీయొద్దు

- కొత్తగా ఎన్నికైన నేతలకు మంత్రి లోకేశ్ సూచన

2

ఎమర్జెన్సీ నిర్ణయం తప్పే!

ఆనాటి పరిస్థితులను వెల్లడించిన సోనియా గాంధీ

3





4

కమశిక్షణే సైనికుడిని యోధుడిగా మారుస్తుంది

- కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

ఫిర్యాదులను పట్టించుకోరా?

- వైఎస్సార్‌సీపీ నేతల తీవ్ర ఆగ్రహం

3



ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు!

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి

ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలి

సమాజానికి వెలుగునిచ్చేలా దీపాలు వెలిగించాలి

రాష్ట్ర ప్రజలందరికీ సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు

అమరావతి, నవంబర్ 7 (సమయం న్యూస్): రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దీపావళి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. నరకాసురుని చెర నుంచి లోకానికి విముక్తి కలిగించి, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ దీపావళి ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నింపాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని సీఎం ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఆశలు చిగురించాలని అభిలషించారు. ప్రజలు వెలిగించే దీపం తమ ఇంటికే కాకుండా సమాజానికి కూడా వెలుగునివ్వాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు. సాటి వారి జీవితాల్లో సంతోషాన్ని నింపడం కూడా పండుగలో భాగం కావాలని సూచించారు. మన పండుగలు అందించే సందేశాన్ని అర్థం చేసుకుని, పరస్పర సహకారం, ఐకమత్యంతో అందరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ దీపాల పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ మరోసారి తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.



దీపకాంతి.. పరబ్రహ్మ స్వరూపం!

ప్రతి లోగిలిలో ఆనందం, ఆరోగ్యం వెల్లివిరియాలి

సంక్షేమ దీపాలు వెలిగిస్తున్న కూటమి ప్రభుత్వం

స్థానిక ఎన్నికల తీర్పుతో ముందే వచ్చిన దీపావళి

ప్రజలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శుభాకాంక్షలు



అమరావతి, నవంబర్ 7 (సమయం న్యూస్): వెలుగుల పండుగ దీపావళి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలతో పాటు ప్రతి భారతీయుడికీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి ప్రతి లోగిలిలో వెలుగులు నింపి, ఆనందం, ఆరోగ్యం, శుభాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. దీపకాంతిని పరబ్రహ్మ స్వరూపంగా ఆరాధించే గొప్ప సంస్కృతి భారతీయులదని ఆయన పేర్కొన్నారు. నరకాసురుడి సంహారం అనంతరం మానవాళికి సుఖసంతోషాలు లభించాయనే విశ్వాసంతో దీపాలు వెలిగించి దీపావళి వేడుకలు జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ పర్వదినాన ప్రజలందరికీ సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో అభివృద్ధి కాంతులను ప్రసరింపజేస్తూ, సంక్షేమ దీపాలను వెలిగిస్తోందని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు, సంక్షేమ పథకాలకు మద్దతుగా నిలిచి కూటమి పక్షాలకు ఘన విజయాన్ని అందించారని గుర్తుచేశారు. ప్రజల తీర్పుతో రాష్ట్రంలో ముందుగానే దీపావళి వేడుకలు వచ్చినట్లయిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

చీకటిపై వెలుగు సాధించిన విజయం!

అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీక

తెలుగు ప్రజలందరికీ సకల శుభాలు కలగాలి

ప్రతి ఇంటా ఆనంద కాంతులు విరాజిల్లాలి

దీపావళి శుభాకాంక్షలు తెలిపిన మాజీ సీఎం వైఎస్ జగన్



తాడేపల్లి, నవంబర్ 7 (సమయం న్యూస్): దీపావళి పర్వదినం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి అంటేనే ఉజ్వల కాంతి అని, చీకటిపై వెలుగు సాధించిన విజయమని ఆయన అభివర్ణించారు. చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం, దుష్టశక్తులపై దైవశక్తి సాధించిన అద్భుత విజయాలకు ప్రతీకగా జరుపుకునే పండుగ దీపావళి అని మాజీ ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ పండుగ సందర్భంగా తెలుగు ప్రజలందరికీ సకల శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు, విజయాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలందరి జీవితాలు శోభాయమానంగా వెలుగొందాలని, ప్రతి ఇంటా ఆనంద కాంతులు విరాజిల్లాలని వైఎస్ జగన్ మనస్ఫూర్తిగా కోరుకున్నారు

అహంకారం దరిచేరనీయొద్దు

కొత్తగా ఎన్నికైన నేతలకు మంత్రి లోకేశ్ పిలుపు

అమరావతి, నవంబర్ 7 (సమయం న్యూస్): జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికే పట్టం కట్టారని తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఈ చారిత్రాత్మక విజయం కూటమి ప్రభుత్వ సుపరిపాలనకు నిదర్శనమని, పార్టీల మధ్య ఉన్న అద్భుతమైన సమన్వయం, సమిష్టి కృషికి దక్కిన ఫలితమని ఆయన పేర్కొన్నారు. ఈ ఘన విజయానికి కారణమైన ప్రజలు, కూటమి నేతలు, కార్యకర్తలకు ఆయన తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలోని నగరాలు, పట్టణాలు, పల్లెల్లో ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పూర్తి మద్దతుగా నిలిచారని లోకేశ్ సంతోషం వ్యక్తం చేశారు. ఓటమి లేని కూటమి జైత్రయాత్ర.. ప్రజలు తమపై ఉంచిన నమ్మకానికి, అప్పగించిన బాధ్యతకు ప్రతీక అని ఆయన అభివర్ణించారు. ఈ అఖండ గెలుపుతో అహంకారం దరిచేరకుండా ప్రజాసేవకు పునరంకితం కావాలని కొత్తగా ఎన్నికైన నేతలకు ఆయన పిలుపునిచ్చారు. రాగద్వేషాలకు అతీతంగా ప్రజలందరికీ వివక్ష లేని సుపరిపాలన అందించాలని సూచించారు.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్!

- **రాష్ట్ర పారిశ్రామిక విధానాలకు ప్రపంచ గుర్తింపు తేవాలి**
- **యువత టాలెంట్‌కు అంతర్జాతీయ అవకాశాలు కల్పించాలి**
- **పారిశ్రామికవేత్తలకు భరోసా ఇవ్వండి**
- **సీఐఐ సదస్సు ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు సమీక్ష**

అమరావతి, నవంబర్ 7 (సమయం న్యూస్): అద్భుతమైన విధానాలు, సమర్థులైన నిపుణులు, మౌలిక సదుపాయాలు, బలమైన నాయకత్వం ఉన్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు అత్యంత సురక్షితమని, ఇక్కడ వ్యాపారం నిర్వహించడం చాలా సులభమనే వాస్తవాన్ని అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలకు వివరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎంఎస్ఎంఈలకు కొత్త వ్యాపార అవకాశాలు కల్పించడంతో పాటు.. మన రాష్ట్ర పరిశ్రమలను ప్రపంచ మార్కెట్లతో అనుసంధానం చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సుఉ 2026 ఏర్పాట్లు, ముసాయిదా ప్రకటనలపై ముఖ్యమంత్రి గురువారం తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో పాటు సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. విధాన నిర్ణేతలు, పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, విద్యాసంస్థలు, స్టార్టప్‌లను ఒకే వేదికపైకి తీసుకొచ్చి చర్చలను వాణిజ్య, సాంకేతిక భాగస్వామ్యాలుగా మార్చాలని అధికారులకు సూచించారు. సాంకేతిక సహకార రంగంలో రాష్ట్ర ప్రాధాన్యతను పెంచడంతో పాటు, యువత ప్రతిభకు అంతర్జాతీయ అవకాశాలు కల్పించే అంశాలపై దృష్టి సారించాలన్నారు. ఎస్క్రో ఖాతాల ద్వారా పారిశ్రామిక ప్రోత్సాహకాలు చెల్లించే విధానం, 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' వంటి విధానాలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకురావాలని ఆదేశించారు. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, సెమీకండక్టర్ రంగాల్లో ఉన్న పెట్టుబడి అవకాశాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

59 దేశాల నుంచి ప్రతినిధులు..

'నూతన ప్రపంచ వ్యవస్థలో ముందడుగు: వాణిజ్యం, సాంకేతికత, విశ్వాసం' అనే ఇతివృత్తంతో రెండు రోజులపాటు విశాఖలో ఈ అంతర్జాతీయ సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు 59 దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరుకానున్నారు. మొత్తం 1,250 మంది పాల్గొనే అవకాశం ఉండగా.. వారిలో 15 మంది విదేశాంగ మంత్రులు, 40 మందికి పైగా అంతర్జాతీయ వక్తలు, 350 మంది విదేశీ ప్రతినిధులు, 900 మంది భారతీయ ప్రతినిధులు ఉన్నారు. వివిధ సంస్థల మధ్య భాగస్వామ్యాలను ప్రోత్సహించేందుకు సుమారు 400 బీ2బీ (బిజినెస్ టు బిజినెస్) సమావేశాలు నిర్వహించనున్నారు. పరిశ్రమలు, ప్రభుత్వాల మధ్య చర్చలకు వీలుగా బీ2జీ (బిజినెస్ టు గవర్నమెంట్) సమావేశాలు కూడా ఏర్పాటు చేయనున్నారు. సింగపూర్, నేపాల్, కంబోడియా, కెనడా తదితర దేశాల ప్రభుత్వ ప్రతినిధులతో పాటు డబ్ల్యూఫ్ఐ, ఏడీబీ, ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం ప్రతినిధులు కూడా హాజరుకానున్నారు.



ఆరు కీలక రంగాలపైనే ప్రధాన చర్చలు..

ఈ భాగస్వామ్య సదస్సులో వాణిజ్యం నుంచి క్వాంటం టెక్నాలజీ వరకు మొత్తం ఆరు ప్రధాన అంశాలపై చర్చలు జరగనున్నాయి. వాణిజ్యం, పెట్టుబడులు, ప్రపంచ సరఫరా వ్యవస్థలపై ప్రతినిధులు ప్రధానంగా చర్చించనున్నారు. అలాగే విశ్వాసం, భౌగోళిక ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ సహకార అంశాలపై దృష్టి సారించనున్నారు. వ్యవసాయం, ఆహార భద్రత, జీవ ఆధారిత ఆర్థిక వ్యవస్థపై లోతైన విశ్లేషణలు జరగనున్నాయి. యువత ప్రతిభ, నైపుణ్యాలు, అంతర్జాతీయ ఉపాధి అవకాశాల కల్పనపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. వీటితో పాటుగా సాంకేతికత, ఆవిష్కరణలు, భవిష్యత్ పరిశ్రమలు, స్వచ్ఛ ఇంధనం, సుస్థిర అభివృద్ధి తదితర అంశాల చుట్టూ ఈ సదస్సులో చర్చలు సాగనున్నాయి. ఈ ప్రతిష్ఠాత్మక సదస్సు ద్వారా రాష్ట్రానికి అంతర్జాతీయ పెట్టుబడులు భారీగా వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

స్వచ్ఛతలో మనమే మేటి!

- **ఏపీకి ఆరు ప్రతిష్ఠాత్మక స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు**
- **సత్తా చాటిన విజయవాడ, విశాఖ, గుంటూరు, తిరుపతి**
- **అవార్డుల జాబితాలో రాజమండ్రి, కుప్పం**
- **పట్టణాలనూ డంపింగ్ యార్డ్ రహితంగా మారుస్తాం**
- **అధికారుల కృషిని కొనియాడిన మంత్రి నారాయణ**
- **ఈ నెల 11న న్యూఢిల్లీలో పురస్కారాల ప్రదానం**

అమరావతి, నవంబర్ 7 (సమయం న్యూస్): రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలను పూర్తిస్థాయిలో డంపింగ్ యార్డ్ రహితంగా తీర్చిదిద్దుతామని, జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి ఆరు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు రావడం గర్వకారణమని మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలోని పట్టణాలను పరిశుభ్రంగా మార్చేందుకు అనేక పటిష్ట చర్యలు చేపట్టామని ఆయన వెల్లడించారు. జాతీయ స్థాయిలో రాష్ట్ర మున్సిపల్ శాఖకు మరోసారి గొప్ప గుర్తింపు లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, రాజమండ్రి, తిరుపతి నగరపాలక సంస్థలతో పాటు కుప్పం మున్సిపాలిటీకి చోటు దక్కిందని మంత్రి తెలిపారు.

ప్రతి నెల మూడో శనివారం నిర్వహిస్తున్న 'ఆంధ్ర కార్యక్రమం', 'స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమం' ద్వారా పట్టణాలను పూర్తిగా చెత్తరహితంగా మార్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని మంత్రి చెప్పారు. ఈ అరుదైన అవార్డులు సాధించడంలో అహర్నిశలు శ్రమించిన ఆయా మున్సిపాలిటీల అధికారులు, పారిశుధ్య సిబ్బంది, ఉద్యోగులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు కూడా రాష్ట్రంలోని అన్ని పట్టణాలను పరిశుభ్రతలో అగ్రభాగాన నిలుపుతామని మంత్రి నారాయణ వివరించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఎంపికైన ఈ ఆరు నగరాలకు ఈ నెల 11న న్యూఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అవార్డులను ప్రదానం చేయనుందని ఆయన వెల్లడించారు.



పల్లెల్లోనూ కూటమి ప్రభంజనం!

(మొదటి పేజీ తరువాయి..)

28 జిల్లా పరిషత్ చైర్మన్ పీఠాలను కూటమి దక్కించుకునే దిశగా స్పష్టమైన ఆధిక్యంలో నిలిచింది.

73 శాతానికి పైగా స్థానాలు గెలుచుకున్న కూటమి

రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల లెక్కింపు 92.2 శాతం పూర్తయ్యే సరికి కూటమి ఏకంగా 73.73 శాతం స్థానాలను కైవసం చేసుకుంది. మొత్తం 659 జడ్పీటీసీ స్థానాలకు గాను 579 స్థానాల ఫలితాలు వెల్లడి కాగా, అందులో ఏకంగా 491 స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయదుందుభి మోగించారు. వైకాపా కేవలం 55 స్థానాలకే పరిమితం కాగా, ఇతరులు నాలుగు చోట్ల నెగ్గారు. ఇక మొత్తం 9,829 ఎంపీటీసీ స్థానాలకు గాను 9,093 ఫలితాలు వెల్లడయ్యాయి. ఇందులో కూటమి అభ్యర్థులు అత్యధికంగా 7,219 ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకున్నారు. వైకాపా కేవలం 1,603 స్థానాలకు పరిమితమవ్వగా, ఇతరులు, ఇండిపెండెంట్లు కలిపి 271 చోట్ల గెలుపొందారు. ఈ గెలుపొందిన ఎంపీటీసీల్లో తెదేపా ఏకంగా 6,616 స్థానాలు దక్కించుకోగా, జనసేన 935, భాజపా 182 చోట్ల ఘన విజయం సాధించాయి.



కడపలో ఏకపక్ష విజయాలు

ఉమ్మడి కడప జిల్లాలో కూటమి అభ్యర్థులు భారీ మెజార్టీలతో చరిత్ర తిరగరాశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 39 జడ్పీటీసీ స్థానాల్లో 23 ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 16 స్థానాలకు 71 మంది అభ్యర్థులు పోటీపడగా అందులో 13 స్థానాలను కూటమి అభ్యర్థులే కైవసం చేసుకున్నారు. వేంపల్లి, వేముల మండలాల్లో మాత్రమే వైకాపా అభ్యర్థులు విజయం సాధించారు. నందలూరు జడ్పీటీసీ కౌంటింగ్ ఇంకా కొనసాగుతోంది. జిల్లా మొత్తం మీద చూసుకుంటే జడ్పీటీసీల్లో తెదేపా 30, భాజపా 3, జనసేన 3 స్థానాలను సాధించగా వైకాపా కేవలం రెండు స్థానాలకే పరిమితమై చతికిలపడింది. ఎంపీటీసీల విషయానికొస్తే కడప జిల్లాలో 351 స్థానాలు ఇప్పటికే కూటమికి ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 55 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగితే ముప్పైకి పైగా స్థానాల్లో కూటమి అభ్యర్థులు తమ సత్తా చాటారు. అక్కడక్కడా వైకాపా అభ్యర్థులు, మరికొన్ని చోట్ల ఇండిపెండెంట్లు గెలుపొందారు.

బద్దలైన పులివెందుల కంచుకోట

మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సొంత ఇలాకాలో కూటమి అభ్యర్థులు పాగా వేసి సంచలనం సృష్టించారు. వైకాపాకు కంచుకోటల్లాంటి పులివెందుల, మైదుకూరు జడ్పీటీసీలను తెదేపా కైవసం చేసుకుంది. పులివెందుల జడ్పీటీసీ స్థానంలో తెదేపా అభ్యర్థి భారతి 1,463 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మైదుకూరులో ఏకంగా 18,903 ఓట్ల మెజారిటీతో తెదేపా అభ్యర్థి కృష్ణకిషోర్ ఘన విజయం సాధించారు. రాజంపేట మండలం నుంచి పోటీ చేసిన తెదేపా అభ్యర్థి పోలి సుబ్బారెడ్డి సైతం 17,440 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. ఈ అఖండ విజయాలతో ఉమ్మడి కడప జిల్లాలో సైతం ఎన్డీఏ ప్రభంజనం స్పష్టంగా కనిపించింది.



నిడదవోలులో వార్ వన్ సైడ్!

- **పరిషత్ పోరులో కూటమి అఖండ విజయం**
- **54 ఎంపీటీసీ, 3 జెడ్పీటీసీ స్థానాల కైవసం**
- **గెలిచిన అభ్యర్థులను సత్కరించిన మంత్రి కందుల దుర్గేష్**

నిడదవోలు, నవంబర్ 7 (సమయం న్యూస్): రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పరిషత్ పోరులో కూటమి ప్రభంజనం సృష్టించిందని, నిడదవోలు నియోజకవర్గంలో ఎన్నికల వార్ పూర్తిగా 'వన్ సైడ్' అయిందని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ఆయన.. ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలోని మొత్తం 62 ఎంపీటీసీ స్థానాలకు గాను ఏకంగా 54 స్థానాల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించారని తెలిపారు. ఇందులో టీడీపీ 29, జనసేన 24, బీజేపీ ఒక స్థానాన్ని దక్కించుకున్నాయని వివరించారు. నియోజకవర్గంలోని మూడు జెడ్పీటీసీ స్థానాలనూ కూటమినే కైవసం చేసుకుందని, పెరవలిలో టీడీపీ గెలుపొందగా.. ఉండ్రాజవరం, నిడదవోలు మండలాల్లో జనసేన ప్రభంజనం సృష్టించిందన్నారు. ఉండ్రాజవరంలో జనసేన క్లీన్ స్వీప్ చేసిందని ఆనందం వ్యక్తం చేశారు. అన్ని చోట్లా 11 వేల ఓట్లకు పైగా భారీ మెజార్టీ రావడం ప్రజల నమ్మకానికి నిదర్శనమన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్, స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, బీజేపీ నాయకత్వం ఒకే తాటిపై నిలిచి పనిచేయడం వల్లే ఈ అఖండ విజయం సాధ్యమైందని మంత్రి దుర్గేష్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల అభివృద్ధి పాలనకు ప్రజలు పట్టంకట్టారని కొనియాడారు. సీటు రాకపోయినా నిరాశ చెందకుండా కూటమి విజయం కోసం అహర్నిశలు శ్రమించిన నాయకులు, కార్యకర్తలకు ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతమైన దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు మంత్రి కందుల దుర్గేష్ శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయాల్లో నరకాసురుడిని తలపించే నాయకులను పక్కనబెట్టి, ఏపీకి సరికొత్త ప్రజాస్వామ్య వెలుగులను అందించిన ఓటర్లకు కృతజ్ఞతలు చెప్పారు. క్రాస్ ఓటింగ్‌ను అడ్డుపెట్టుకుని వివాదాలు సృష్టించాలనుకున్న వైకాపాకు ప్రజలు ఓటుతోనే సరైన బుద్ధి చెప్పారని విమర్శించారు. నిడదవోలును త్వరలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. త్వరలో రాబోయే సర్పంచ్ ఎన్నికల్లోనూ కూటమికి ఇదే తరహా విజయాన్ని కట్టబెట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

బాధితులకు అండగా నిలవండి!



- సహాయక చర్యలు వేగవంతం చేయాలని సీఎం ఆదేశం
- మురసు తుఫాన్ నష్టం, పునరావాసంపై ఉన్నతస్థాయి సమీక్ష
- 92 శాతం పూర్తయిన ఉద్యాన పంటల నష్టం అంచనా
- 3.82 లక్షల కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ
- ఆదివారం నాటికి పూర్తిస్థాయిలో సరుకులు అందించాలని స్పష్టీకరణ

అమరావతి, నవంబర్ 7 (సమయం న్యూస్) : మురసు తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో జరిగిన నష్టం, బాధితులకు అందిస్తున్న సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇరిగేషన్, రెవెన్యూ, విద్యుత్, వ్యవసాయ, పౌరసరఫరాల శాఖల ఉన్నతాధికారులతో మాట్లాడి క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ, బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ, తక్షణ ఆర్థిక సాయం అందించే ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆయన ఆదేశించారు. పంట నష్టం అంచనాలను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సహాయం అందించేందుకు పక్కా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. దెబ్బతిన్న ఉద్యాన పంటలకు సంబంధించి ఇప్పటికే 92 శాతం మేర నష్టం అంచనాలు పూర్తయ్యాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వ్యవసాయ పంటలకు సంబంధించి ఈ నెల తొమ్మిదో తేదీ నాటికి నష్టం అంచనా ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించారు. రైతాంగానికి ఎక్కడా నష్టం వాటిల్లకుండా పారదర్శకంగా ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం సూచించారు.

విద్యుత్ పునరుద్ధరణ పనుల పురోగతిపై ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ఆరా తీశారు. అర్నబ్ తుఫాన్ కారణంగా సుమారు 30 వేల విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని, ప్రభావిత గ్రామాలన్నింటిలో విద్యుత్ సరఫరాను విజయవంతంగా పునరుద్ధరించినట్లు అధికారులు సీఎంకు వివరించారు. అలాగే మురసు తుఫాన్ ప్రభావిత 1,825 గ్రామాల్లో పునరుద్ధరణ పనులు చేపట్టగా.. ఇప్పటివరకు 7,850 దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను బాగు చేసి కరెంట్ సరఫరాను పునరుద్ధరించినట్లు అధికారులు స్పష్టం చేశారు.

తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ క్షేత్రస్థాయిలో కొనసాగుతోందని పౌరసరఫరాల శాఖ అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు 3.82 లక్షల కుటుంబాలకు సరుకులు అందించినట్లు తెలిపారు. ఆదివారం నాటికి పంపిణీని పూర్తిస్థాయిలో ముగిస్తామని సీఎంకు వివరించారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఆదేశించారు.

అందుబాటు ధరల్లోకి బియ్యం!

- వివిధ రకాల బియ్యం ధరలను నిర్ధారించిన ప్రభుత్వం
- వ్యాపారులు, మిల్లర్లతో చర్చలు జరిపిన అధికారులు
- నిత్యావసరాల ధరల నియంత్రణపై సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి, నవంబర్ 7 (సమయం న్యూస్): మార్కెట్‌లో ఉల్లిపాయలు, బియ్యం, పామాయిల్, గోధుమ పిండి, కందిపప్పు తదితర నిత్యావసరాల ధరలను నియంత్రించేందుకు తీసుకుంటున్న చర్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. శనివారం అధికారులతో సమావేశమైన ఆయన ధరల నియంత్రణపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రైతుబజార్ల ద్వారా కిలో ఉల్లిపాయలను 35 రూపాయలకే విక్రయిస్తున్నామని ఈ సందర్భంగా అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఇందుకోసం 8 వేల క్వింటాళ్ల ఉల్లిపాయలను మార్కెట్‌లోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు.

బియ్యం ధరలపై వ్యాపారులతో చర్చలు

బియ్యం ధరలను నియంత్రించేందుకు మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులతో చర్చలు జరిపినట్లు అధికారులు సీఎంకు తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో వివిధ రకాల బియ్యాన్ని నిర్ణీత ధరలకు విక్రయించేందుకు వ్యాపారులు అంగీకరించారని చెప్పారు. బీపీటీ సోనా, సాంబ, కేఎన్ఎం రకాలను 66 రూపాయలకు, హెచ్ఎంటీ, ఆర్ఎన్ఆర్ రకాలను 76 రూపాయలకు విక్రయించనున్నట్లు స్పష్టం చేశారు. అలాగే జై శ్రీరామ్ రకాన్ని 82 రూపాయలకు, సాధారణ రకం బియ్యాన్ని 47 రూపాయలకు అందించేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి అధిక ధరలకు అమ్ముతున్న 204 మంది వ్యాపారులపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ధరణి బ్రాండ్ బియ్యాన్ని రైతుబజార్లలో అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు అధికారులు తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో కిలో 70 రూపాయలు పలుకుతున్న బియ్యాన్ని రైతుబజార్లలో 50 రూపాయలకే విక్రయిస్తున్నామని, బీపీటీ రకం బియ్యాన్ని 49 రూపాయలకే అందిస్తున్నామని వివరించారు. ఇప్పటివరకు 150 కౌంటర్ల ద్వారా 27,430 క్వింటాళ్ల బియ్యాన్ని విక్రయించగా.. ఒక లక్షా మూడు వేల కుటుంబాలు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.

రేషన్ దుకాణాల్లో సబ్సిడీ సరుకులు

రేషన్ దుకాణాల ద్వారా కూడా సామాన్యులకు తక్కువ ధరలకు సరుకులు అందించేందుకు ప్రభుత్వం పక్కా చర్యలు చేపట్టింది. లీటర్ పామాయిల్ 125 రూపాయలకు, కిలో కందిపప్పు 100 రూపాయలకు, కిలో గోధుమ పిండి 25 రూపాయలకు పంపిణీ చేసేలా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పట్టించుకోరా?

- అక్రమాలపై ఫిర్యాదు చేసినా స్పందించని ఎస్ఈసీ, పోలీసులు
- కౌంటింగ్ కేంద్రాల్లోకి మా ఏజెంట్లను అనుమతించలేదు
- టీడీపీ నేతలు దౌర్జన్యం చేస్తున్నా ప్రేక్షకపాత్ర వహించారు
- కేంద్ర ఎన్నికల సంఘం తక్షణమే విచారణ జరిపించాలి
- వైఎస్సార్‌సీపీ నేతల తీవ్ర ఆగ్రహం

విజయవాడ, నవంబర్ 7 (సమయం న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్‌లో జరిగిన అక్రమాలపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ), పోలీసులు ఏమాత్రం పట్టించుకోలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు టీజేఆర్ సుధాకర్ బాబు, మలసాని మనోహర్ రెడ్డి, నలమారు చంద్రశేఖర్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. పదేపదే ఫిర్యాదులు చేసినా అధికారుల నుంచి సకాలంలో స్పందన కరువైందని వారు ఆరోపించారు. మాజీ ఎంపీ తలారి రంగయ్యను కౌంటింగ్ కేంద్రానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని సుధాకర్ బాబు విమర్శించారు. శిల్పా చక్రపాణి రెడ్డి, శిల్పా రవిచంద్ర రెడ్డి, శిల్పా భువనేశ్వర్ రెడ్డిలను గృహనిర్బంధం చేశారని మండిపడ్డారు. బైరెడ్డి సిద్ధార్థ రెడ్డితో పాటు మాజీ మంత్రి సాకే శైలజానాథ్‌ను అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారని ఆయన దుయ్యబట్టారు. బైండోవర్ కేసుల సాకు చూపిస్తూ ఇబ్రహీంపట్నం, కటికలపూడి, పీలేరు, జగ్గయ్యపేట తదితర ప్రాంతాల్లో తమ పార్టీ ఏజెంట్లను కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించలేదని ఆరోపించారు. బాలకృష్ణ అనుచరులతో సహా పలువురు టీడీపీ నేతలు కౌంటింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించి తమ ఏజెంట్లను బెదిరించినా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బ్యాలెట్ బాక్సుల ఘటనపై విచారణ జరిపించాలి

వెంగళాయపాలెం బ్యాలెట్ బాక్సుల ఘటనపై సుధాకర్ బాబు స్పందిస్తూ.. బస్సులో నుంచి బాక్సులను కిందకు దించడం ముమ్మాటికీ తప్పేనని పోలింగ్ అధికారి అంగీకరించారని గుర్తుచేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఫుటేజీని కోర్టుకు సమర్పించామని ఆయన తెలిపారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి అరెస్టుపై ఎస్ఈసీ తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. సరైన పత్రాలు ఉన్నప్పటికీ తమ ఏజెంట్లను కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించలేదని మనోహర్ రెడ్డి ఆరోపించారు. కొన్ని చోట్ల పోలీసులు తమ వారిపై భౌతిక దాడికి సైతం దిగారని మండిపడ్డారు. కల్యాణదుర్గంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు కుటుంబ సభ్యులు, పుట్టపర్తిలో మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్లారని ఆయన గుర్తుచేశారు.

ఫలితాలను మార్చేందుకు కుట్రలు

నామినేషన్ల పర్వం నుంచి కౌంటింగ్ ముగిసే వరకు అధికార పక్షం ఇష్టారాజ్యంగా వ్యవహరించిందని చంద్రశేఖర్ రెడ్డి విమర్శించారు. రీకౌంటింగ్ పేరుతో ఫలితాలను తారుమారు చేసేందుకు కుట్రలు పన్నారని ఆయన ఆరోపించారు. ఎన్నికల అక్రమాలపై ఎస్ఈసీ, డీజీపీ, పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని ఈ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ తీరుపై కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.



ఎమర్జెన్సీ నిర్ణయం తప్పే!

ఆనాటి పరిస్థితులను వెల్లడించిన సోనియా గాంధీ

న్యూఢిల్లీ, నవంబర్ 7 (సమయం న్యూస్) : భారత రాజకీయ చరిత్రలో అత్యంత వివాదాస్పద ఘట్టాల్లో ఒకటైన ఎమర్జెన్సీపై కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. 1975లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించడం తప్పేనని, ఆ నిర్ణయం పట్ల ఆమె కూడా పశ్చాత్తాపం వ్యక్తం చేశారని వెల్లడించారు. త్వరలో విడుదల కానున్న తన ఆత్మకథ 'బిలాంగింగ్: ది జర్నీ ఆఫ్ లవ్'లో ఈ విషయాలను ప్రస్తావించినట్లు సోనియా తెలిపారు. బ్రిటన్‌కు చెందిన 'ది గార్డియన్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ కీలక విషయాలను వెల్లడించారు. ఇందిరా గాంధీకి ప్రజాస్వామ్యంపై అపారమైన విశ్వాసం ఉందని, ఎమర్జెన్సీ అమలులో ఉన్న సమయంలో ఆమె కూడా అసౌకర్యంగా ఫీలయ్యారని సోనియా అభిప్రాయపడ్డారు. ఆ నిర్ణయం ఆమెను లోలోపల ఇబ్బంది పెట్టి ఉంటుందని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ విధించాలనే నిర్ణయంపై ఇందిరా గాంధీ కుటుంబంలోనూ తీవ్ర భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయని సోనియా వెల్లడించారు. తన భర్త రాజీవ్ గాంధీ ఎమర్జెన్సీ విధించకుండా, తదుపరి ఎన్నికల వరకు వేచి చూడాలని తల్లి ఇందిరకు సూచించినట్లు చెప్పారు. అయితే ఇందిరా గాంధీ చిన్న కుమారుడు సంజయ్ గాంధీ మాత్రం ఎమర్జెన్సీ నిర్ణయాన్ని బలంగా సమర్థించినట్లు సోనియా వివరించారు. ప్రతిపక్షాలను అడ్డుకోవాల్సిందేనని సంజయ్ భావించారని పేర్కొన్నారు. ఒక కుటుంబ విందు సందర్భంగా కూడా ఈ అంశంపై చర్చ జరిగిందని, అప్పట్లో సంజయ్ చేసిన వ్యాఖ్యలు ఇందిరా గాంధీ నిర్ణయంపై తీవ్ర ప్రభావం చూపాయని సోనియా తన పుస్తకంలో వివరించినట్లు 'ది గార్డియన్' పేర్కొంది. ఎమర్జెన్సీ సమయంలో జరిగిన అనేక పరిణామాలకు సంజయ్ గాంధీ ప్రభావం కూడా ఒక ప్రధాన కారణమని సోనియా గాంధీ అభిప్రాయపడ్డారు. ఆయనను అదుపులో ఉంచి ఉంటే ఎమర్జెన్సీ సమయంలో దేశానికి జరిగిన నష్టంలో చాలా వరకు నివారించగలిగేవారమని తన పుస్తకంలో పేర్కొన్నట్లు వెల్లడించారు. ఎమర్జెన్సీ సమయంలో సంజయ్ గాంధీకి ఎలాంటి అధికారిక మంత్రి పదవి లేకపోయినా, ప్రభుత్వ వ్యవహారాలపై ఆయనకు గణనీయమైన ప్రభావం ఉండేదని అప్పట్లో విమర్శలు వచ్చాయి. బలవంతపు కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు, ఢిల్లీలో మురికివాడల తొలగింపు వంటి చర్యలు అప్పట్లో తీవ్ర వివాదాలకు దారితీశాయి. దేశ రాజకీయ చరిత్రలో 1975 జూన్ 25న దేశంలో ఎమర్జెన్సీ విధించారు. 1977 మార్చి వరకు దాదాపు 21 నెలల పాటు ఇది కొనసాగింది. ఈ సమయంలో దేశవ్యాప్తంగా పౌర హక్కులపై ఆంక్షలు విధించారు. విపక్ష నాయకులను సామూహికంగా అరెస్టు చేశారు. పత్రికలపై సెన్సార్‌షిప్ అమలైంది. ఈ పరిణామాలన్నింటినీ భారత ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయంగా పరిగణిస్తారు.

ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా?


ఎమ్మెల్సీ అప్పిరెడ్డి అరెస్టును ఖండించిన వైఎస్ జగన్

బ్యాలెట్ బాక్సులు రోడ్డుపైకి ఎలా వచ్చాయని ప్రశ్న

విధులకు ఆటంకం కలిగించారంటూ అప్పిరెడ్డికి రిమాండ్

గుంటూరు జిల్లా నల్లపాడు వద్ద బ్యాలెట్ బాక్సుల కలకలం

అమరావతి, నవంబర్ 7 (సమయం న్యూస్): స్ట్రాంగ్ రూమ్‌కు చేరాల్సిన బ్యాలెట్ బాక్సులు నడిరోడ్డుపై ఎందుకు కనిపించాయంటూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లాలో బ్యాలెట్ బాక్సుల తరలింపులో జరిగిన అక్రమాలను ప్రశ్నిస్తూ ఆందోళన చేపట్టిన తమ పార్టీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఎన్నికల అక్రమాలను ప్రశ్నిస్తే కేసులు పెట్టి అరెస్టులు చేస్తారా అంటూ పోలీసుల తీరును, ప్రభుత్వాన్ని జగన్ తీవ్రస్థాయిలో నిలదీశారు. గుంటూరు సమీపంలోని నల్లపాడు వద్ద బ్యాలెట్ బాక్సులను ఎందుకు దించాల్సి వచ్చిందో అధికారులు సమాధానం చెప్పాలని జగన్ డిమాండ్ చేశారు. అసలు ఎవరి ఆదేశాలతో ఆ బ్యాలెట్ బాక్సులను అక్కడ దించారు, బాక్సులకు ఉండాల్సిన కట్టుదిట్టమైన భద్రత ఏమైంది అని ఆయన వరుస ప్రశ్నలు సంధించారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికల ప్రక్రియలో ఇలాంటి అనుమానాస్పద ఘటనలు చోటుచేసుకోవడం దారుణమని ఆయన విమర్శించారు.



అప్పిరెడ్డికి రిమాండ్

స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ముగిసిన అనంతరం గుంటూరు జిల్లా వెంగళాయపాలెం నుంచి బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌కు తరలించే క్రమంలో తీవ్ర వివాదం చోటుచేసుకుంది. బ్యాలెట్ బాక్సుల తరలింపుపై అనుమానాలు వ్యక్తం చేస్తూ వైసీపి నాయకులు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఆధ్వర్యంలో గుంటూరు సమీపంలోని నల్లపాడు వద్ద ఆందోళనకు దిగారు. దీంతో గుంటూరు, నల్లపాడు ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎన్నికల సిబ్బంది విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలతో పోలీసులు అప్పిరెడ్డిపై కేసు నమోదు చేశారు. వెంటనే ఆయన్ను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. వాదనలు విన్న న్యాయస్థానం ఎమ్మెల్సీకి 14 రోజుల రిమాండ్ విధించడంతో పోలీసులు ఆయన్ను జైలుకు తరలించారు.

బీజేపీ గూండాల దాడి దారుణం

ఆరు నెలల్లో నా నివాసంపై దాడి జరగడం ఇది ఏడోసారి

దాడులు జరుగుతున్నా పోలీసులు, న్యాయవ్యవస్థ పట్టించుకోరా?

అర్ధరాత్రి రెండు గంటలకు రాళ్లు, కర్రలతో దౌర్జన్యం చేశారు

దాడికి ముందు రెండు రోజుల పాటు రెక్కీ నిర్వహించారు

ఎక్స్ వేదికగా వీడియోలతో సహా పంచుకున్న ఎంపీ అభిషేక్

కోల్‌కతా, నవంబర్ 7 (సమయం న్యూస్) : "బెంగాల్‌లో ఒక ఎంపీ పరిస్థితే ఇలా ఉంటే, ఇక సామాన్యుల పరిస్థితి ఏంటి? ఇక్కడ శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయి. నా ఇంటిపైనే గూండాలు రాళ్లు వేస్తారా?" అంటూ టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళీఘాట్‌లో ఉన్న తన నివాసంపై బీజేపీ మద్దతుదారులు శనివారం తెల్లవారుజామున దాడికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. ఈ దాడులపై పోలీసులు, న్యాయవ్యవస్థ ఏమాత్రం స్పందించకపోవడం దారుణమని ఆయన తన ఎక్స్ ఖాతా ద్వారా మండిపడ్డారు. ఈ దాడి ఘటనపై అభిషేక్ వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే.. "నా ఇంటిపై బీజేపీ గూండాలు పదేపదే దాడులకు తెగబడుతున్నారు. గత ఆరు నెలల కాలంలో నా నివాసంపై ఇలా దాడి జరగడం ఇది ఏడోసారి. నాపై అదేపనిగా దాడులు జరుగుతున్నాయని ఫిర్యాదు చేసినా పోలీసులు, కోర్టు ఏమాత్రం జోక్యం చేసుకోవడంలేదు. శాంతిభద్రతలను పరిరక్షించడంలో న్యాయవ్యవస్థ, పోలీసులు పూర్తిగా విఫలమయ్యారు. పోలీసుల వైఫల్యం వల్లే ఈ గూండాలు రోజూ అల్లర్లకు పాల్పడుతున్నారు. ఒక ఎంపీకే రక్షణ కరువైంది" అని అభిషేక్ బెనర్జీ ఆవేదన వ్యక్తం చేశారు. "శుక్రవారం రాత్రి బీజేపీ, టీఎంసీ మద్దతుదారుల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళనకారులను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కానీ, ఆ తర్వాత అర్ధరాత్రి రెండు గంటల సమయంలో బీజేపీ మద్దతుదారులు నా ఇంటిపైకి ఒక్కసారిగా రాళ్లు విసిరారు. ఈ దాడికి పాల్పడేందుకు వారు ముందుగా రెండు రోజుల పాటు పక్కాగా రెక్కీ కూడా నిర్వహించారు. ఇదంతా ఒక ప్రణాళిక ప్రకారమే జరిగింది" అని ఆయన ఆరోపించారు. తన నివాసంపై జరిగిన దాడికి సంబంధించిన రెండు వీడియోలను అభిషేక్ బెనర్జీ సాక్ష్యాలతో సహా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో పంచుకున్నారు. ఒక వీడియోలో ఓ వ్యక్తి వెదురు కర్రలతో బిల్డింగ్ గేట్లపై దాడిచేస్తూ కనిపించగా.. మరో వీడియోలో కొందరు వ్యక్తులు ఒక గుంపుగా ఏర్పడి ఆయన బిల్డింగ్ వైపు పలు వస్తువులను విసురుతూ కనిపించారు. "ఈ వీడియోలు చూస్తే అరాచకం ఎలా నడుస్తుందో అందరికీ అర్థమవుతుంది" అంటూ ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

ఎమ్మెల్యే గదిలో 'ఆ' ఇద్దరు!

భోపాల్ విశ్రాంతి గృహంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేకు షాక్

కేటాయించిన గదిలో అభ్యంతరకర స్థితిలో యువతీయువకులు

సిబ్బందిపై మండిపడిన మహిద్‌పూర్ ఎమ్మెల్యే దినేశ్ జైన్ బాస్

భోపాల్, నవంబర్ 7 (సమయం న్యూస్) : మధ్యప్రదేశ్ కాంగ్రెస్ ఎమ్మెల్యేకు భోపాల్‌లోని శాసనసభ్యుల విశ్రాంతి గృహంలో ఊహించని షాక్ తగిలింది. ఎమ్మెల్యేకు కేటాయించిన ఓ గదిలో గుర్తుతెలియని యువతి, యువకుడు అభ్యంతరకర పరిస్థితుల్లో కనిపించడంతో ఆయన ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ షాకింగ్ ఘటన మహిద్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే దినేశ్ జైన్ బాస్‌కు ఎదురైంది. తన గదిలోకి బయటి వ్యక్తులు ఎలా వచ్చారని ఆయన సిబ్బందిని గట్టిగా నిలదీశారు. దీనిపై సంబంధిత అధికారులకు ఆయన లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయగా.. ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. మహిద్‌పూర్ ఎమ్మెల్యే దినేశ్ జైన్ బాస్‌కు భోపాల్ ఎమ్మెల్యేల విశ్రాంతి గృహంలోని బ్లాక్-3లో 14, 15 నంబర్ల గదులను ప్రభుత్వం కేటాయించింది. నవంబర్ రెండో తేదీన ఢిల్లీ నుంచి తిరిగొచ్చిన ఆయన మధ్యాహ్నం విశ్రాంతి గృహానికి చేరుకున్నారు. తొలుత 15వ గది తాళం ఇవ్వాలని అడగ్గా.. అది అందుబాటులో లేదని సిబ్బంది బదులిచ్చారు. దీంతో ఆయన 14వ గది తాళం తీసుకుని వెళ్లారు. అదే సమయంలో పక్కనే ఉన్న 15వ గదిలో ఓ యువతి, యువకుడు అభ్యంతరకర పరిస్థితుల్లో ఉండటాన్ని ఎమ్మెల్యే దినేశ్ కళ్లారా చూశారు. ఎమ్మెల్యేను చూసిన వెంటనే ఆ ఇద్దరూ అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే.. గదులు తనకు కేటాయించినప్పటికీ బయటి వ్యక్తులు లోపలికి ఎలా ప్రవేశించారని అక్కడి సిబ్బందిని నిలదీశారు. ఈ ఊహించని ఘటనపై మధ్యప్రదేశ్ అసెంబ్లీ కార్యదర్శికి ఎమ్మెల్యే దినేశ్ జైన్ బాస్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. భద్రతా వైఫల్యంపై మండిపడుతూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సంపాదకీయం



రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి తెరపడనుందా?

త్వరలోనే భారీ శాంతి ఒప్పందం కుదరవచ్చన్న ట్రంప్

చర్చలకు ఇరు దేశాలు ఆసక్తి చూపుతున్నాయని వెల్లడి

యూరప్ భద్రత, నాటో పాత్రపైనా కీలక నిర్ణయాలకు అవకాశం

ప్రమాదకర ప్రతిపాదనలపై అప్రమత్తంగా ఉండాలన్న జెలెన్స్కీ


ఏళ్లుగా కొనసాగుతున్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే దిశగా కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఇరు దేశాలు యుద్ధాన్ని ముగించేందుకు ఒక ఒప్పందానికి రావడానికి ఆసక్తి చూపుతున్నాయని పేర్కొన్నారు. త్వరలోనే భారీ శాంతి ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం కేవలం రష్యా, ఉక్రెయిన్‌లకే పరిమితం కాకుండా యూరప్ దేశాల భద్రతకు సంబంధించిన అంశాలను కూడా కలిగి ఉండవచ్చని తెలిపారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రత్యేక ప్రతినిధి కిరిల్ దిమిత్రివ్‌తో వైట్‌హౌస్‌లో సమావేశమైన అనంతరం ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా, ఉక్రెయిన్ దేశాలు యుద్ధానికి ముగింపు పలికేందుకు ఒకే వేదికపైకి రావడానికి సిద్ధంగా ఉన్నట్లు తనకు అనిపిస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య శాంతి నెలకొల్పే దిశగా పెద్ద ఒప్పందం కుదరవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ ఒప్పందం యూరప్ మొత్తానికి సంబంధించిన అంశాలను కూడా కలిగి ఉండే అవకాశం ఉందన్నారు. అయితే చర్చల ప్రతిపాదనలు, ఒప్పందం అమలుకు సంబంధించిన వివరాలు ఇంకా స్పష్టతకు రావాల్సి ఉంది. శాంతి ఒప్పందంలో యూరప్ భద్రత, నాటో పాత్ర, భవిష్యత్తులో మరోసారి యుద్ధం తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు వంటి అంశాలు ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉంది. రష్యా–ఉక్రెయిన్ మధ్య నెలకొన్న వివాదానికి శాశ్వత పరిష్కారం లభించాలంటే భద్రతాపరమైన హామీలు కీలకమని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో యూరప్ దేశాల భాగస్వామ్యం కూడా చర్చల్లో ప్రధాన అంశంగా మారవచ్చని ట్రంప్ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. మరోవైపు అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీ అప్రమత్తంగా స్పందించారు. రష్యా, యూరప్ మధ్య భద్రతా ఒప్పందం కుదుర్చుకోవడం అంత సులభమైన విషయం కాదని పేర్కొన్నారు. కొన్ని ప్రతిపాదనలు భవిష్యత్తులో ప్రమాదకర పరిణామాలకు దారితీయవచ్చని హెచ్చరించారు. యుద్ధాన్ని ముగించే ఒప్పందం కుదరాలంటే ముందుగా ఇరు దేశాల మధ్య ఉన్న ప్రధాన సమస్యలకు పరిష్కారం లభించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ముగింపుపై ట్రంప్ వ్యక్తం చేసిన ఆశాభావం అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే శాంతి ఒప్పందం కుదిరేందుకు ఇరు దేశాల అంగీకారంతోపాటు భద్రతా హామీలు, వివాదాస్పద అంశాలపై స్పష్టత అవసరం. ట్రంప్ వ్యాఖ్యలతో శాంతి ప్రయత్నాలపై ఆశలు పెరిగినప్పటికీ, అధికారిక ఒప్పందం కుదిరే వరకు యుద్ధం ముగింపుపై అనిశ్చితి కొనసాగనుంది.

ఈ20 పెట్రోల్‌పై మోదీ సమాధానం చెప్పాల్సిందే!

- **నిర్దేశిత పరిమితికి మించి ఇథనాల్ కలుపుతున్నారంటూ రాహుల్ గాంధీ ఆరోపణలు**
- **కర్ణాటకలో పరీక్షించిన 14 నమూనాల్లో 11 చోట్ల అధిక మోతాదు గుర్తించినట్లు వెల్లడి**
- **కొన్ని నమూనాల్లో 30 శాతం దాటిందన్న కాంగ్రెస్ అగ్రనేత**
- **మైలేజీ తగ్గి వాహనదారులపై అదనపు భారం పడుతోందని విమర్శ**
- **ఇంధనంలో ఇథనాల్ శాతం ఎందుకు వెల్లడించడం లేదని నిలదీత**



న్యూఢిల్లీ, నవంబర్ 7 (సమయం న్యూస్): దేశవ్యాప్తంగా వినియోగిస్తున్న ఈ20 పెట్రోల్‌లో నిర్దేశిత పరిమితికి మించి ఇథనాల్ కలుపుతున్నారంటూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ మాత్రమే ఉంటుందని కేంద్రం చెబుతుండగా, వాస్తవంగా అంతకంటే ఎక్కువ మోతాదులో కలుపుతున్నట్లు కర్ణాటక ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో వెల్లడైందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వాహనదారుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ఇంధన సరఫరా జరుగుతోందని ఆరోపిస్తూ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కర్ణాటక ప్రభుత్వం ఏడు జిల్లాల్లోని పెట్రోల్ బంకుల నుంచి సేకరించిన 14 నమూనాలను గుర్తింపు పొందిన ప్రయోగశాలలో పరీక్షించగా, వాటిలో 11 నమూనాల్లో 20 శాతానికి మించి ఇథనాల్ ఉన్నట్లు తేలిందని రాహుల్ గాంధీ వెల్లడించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు చెందిన ఒక నమూనాలో 31.2 శాతం, హిందుస్థాన్ పెట్రోలియం నమూనాలో 30.5 శాతం ఇథనాల్ ఉన్నట్లు పరీక్షల్లో వెల్లడైందని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ చమురు సంస్థలతోపాటు ప్రైవేటు సంస్థల నమూనాల్లోనూ నిర్దేశిత పరిమితికి మించి ఇథనాల్ ఉన్నట్లు ఆరోపించారు. పెట్రోల్‌లో ఇథనాల్ మోతాదు పెరగడం వల్ల వాహనాల మైలేజీ తగ్గడంతోపాటు కొన్ని వాహనాల్లో నిర్వహణ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అధిక ధరలకు పెట్రోల్ కొనుగోలు చేస్తున్న ప్రజలు మైలేజీ తగ్గితే మరింత ఆర్థిక భారం భరించాల్సి వస్తుందని విమర్శించారు. ముఖ్యంగా పాత వాహనాలు, అధిక ఇథనాల్ మిశ్రమాలకు అనుగుణంగా రూపొందించని ఇంజిన్లపై ప్రభావం ఎలా ఉంటుందో ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. పెట్రోల్ బంకుల్లో విక్రయించే ఇంధనంలో వాస్తవంగా ఎంత శాతం ఇథనాల్ ఉందో వినియోగదారులకు తెలియజేసే పారదర్శక వ్యవస్థ లేకపోవడాన్ని రాహుల్ తప్పుబట్టారు. ప్రజలు కొనుగోలు చేస్తున్న ఇంధన నాణ్యత, మిశ్రమం గురించి తెలుసుకునే హక్కు వారికి ఉందని పేర్కొన్నారు. చమురు సంస్థల సొంత ప్రయోగశాలల పరీక్షలకు, కర్ణాటక ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల ఫలితాలకు మధ్య వ్యత్యాసం ఎందుకు వచ్చిందో వివరించాలని డిమాండ్ చేశారు. ఈ20 పేరుతో విక్రయిస్తున్న పెట్రోల్‌లో వాస్తవంగా ఎంత శాతం ఇథనాల్ కలుపుతున్నారు? నిర్దేశిత పరిమితిని మించినట్లు తేలితే సంబంధిత చమురు సంస్థలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? వాహనదారులకు జరుగుతున్న నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారు? ఇథనాల్ మిశ్రమ వివరాలను బహిరంగంగా ఎందుకు ప్రకటించడం లేదు? అంటూ రాహుల్ గాంధీ ప్రశ్నలు సంధించారు. ఇథనాల్ మిశ్రమ విధానం వల్ల నిజంగా ఎవరికి ప్రయోజనం కలుగుతోందో కేంద్రం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కర్ణాటక ప్రభుత్వం నిర్వహించినట్లు పేర్కొన్న పరీక్షల ఫలితాలపై స్వతంత్ర పరిశీలన జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు. ఈ20 పెట్రోల్‌పై రాహుల్ చేసిన ఆరోపణలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. అయితే నమూనాల పరీక్షల వివరాలు, ఇథనాల్ మోతాదుపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం, చమురు సంస్థల అధికారిక వివరణతోనే పూర్తి స్పష్టత రానుంది.



దేశ ప్రజలకు ప్రధాని మోదీ దీపావళి శుభాకాంక్షలు!

న్యూదిల్లీ, నవంబర్ 7 (సమయం న్యూస్): పవిత్రమైన దీపావళి పండుగ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరి జీవితాలు నిత్యం సుఖసంతోషాలతో, సకల విజయాలతో కాంతివంతంగా వెలిగిపోవాలని ఆయన ఆకాంక్షించారు. చెడుపై మంచి, చీకటిపై వెలుగు సాధించిన మహోన్నత విజయానికి దీపావళి పండుగ దివ్య ప్రతీక అని చెప్పారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా శనివారం ఒక ప్రత్యేక వీడియో సందేశాన్ని పోస్ట్ చేశారు. 'ఈ పవిత్రమైన దీపావళి పర్వదినం మీ జీవితాల్లో నిరంతరం ప్రశాంతతను, ఉన్నత విజయాలను, అలరారే సుఖసంతోషాలను అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని ప్రధాని తన సందేశంలో పేర్కొన్నారు. కాగా, గత కొన్ని సంవత్సరాల నుంచి ప్రధాని మోదీ తన దీపావళి పండుగను సరిహద్దుల్లో దేశాన్ని రక్షిస్తున్న వీర సైనికులతో కలిసి జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా అదే ఆనవాయితీని, సంప్రదాయాన్ని కొనసాగిస్తూ సైనికుల మధ్యనే దీపావళి సంబరాలను జరుపుకోనున్నట్లు ఆయన తన వీడియో సందేశంలో స్పష్టంగా వెల్లడించారు.

క్రమశిక్షణే సైనికుడిని యోధుడిగా మారుస్తుంది

రాజ్‌నాథ్ సింగ్!



కోల్‌కతా, నవంబర్ 7 (సమయం న్యూస్): కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వాయుసేన సిబ్బందితో కలిసి దీపావళి వేడుకలు చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని బాగ్‌డోగ్రా ఎయిర్‌ఫీల్డ్‌లో నిర్వహించిన వేడుకల్లో సైనికులకు ఆయన మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం మాట్లాడుతూ.. భారత వైమానిక దళ సిబ్బంది ధైర్యం, క్రమశిక్షణ, అంకితభావాన్ని ప్రశంసించారు. మన సాయుధ దళాలు సరిహద్దుల్లో రేయింబవళ్లు కాపలాగా ఉండటం వల్లే, దేశ ప్రజలు ప్రతి పండగను ఆనందంగా, స్వేచ్ఛగా జరుపుకొంటున్నారని తెలిపారు. వారు చూపే ధైర్యం, నిస్వార్థ సేవకు యావత్ దేశం ఎంతో గర్వపడుతోందన్నారు. 'ఆపరేషన్ సిందూర్'తో మన వాయుసేన శక్తి ప్రపంచానికి తెలిసిందన్నారు. 'సైనికులలో ధైర్యం, క్రమశిక్షణ లేకపోతే అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉన్నా అది నిష్ప్రయోజనమే. మన సాయుధ దళాలు క్రమశిక్షణకు మారుపేరు. అదే ఒక సాధారణ సైనికుడిని అసాధారణ యోధుడిగా మారుస్తుంది. అదే సమయంలో డ్రోన్లు, సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలతో సహా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలతో సాయుధ దళాలను సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉంది. మీ అందరి సహకారంతో భారత్ మరింత ముందుకు వెళ్తుందని నాకు పూర్తి నమ్మకం ఉంది' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. దేశంలో పెరుగుతోన్న రక్షణ ఉత్పాదక సామర్థ్యాలను రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. 'ఆత్మనిర్భర్ భారత్' దిశగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషి వల్లే దేశీయ స్టార్టప్‌లు, పరిశ్రమలు.. డ్రోన్‌లు, డ్రోన్ నిరోధక వ్యవస్థలు, సైనికుల కోసం అధునాతన పరికరాలను అభివృద్ధి చేస్తున్నాయన్నారు. భవిష్యత్తులో అన్ని రకాల ఆయుధాలు, క్షిపణులను సొంతంగా తయారు చేసుకునే స్థాయికి భారత్ ఎదగాలనేదే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

ధైర్యముంటే నాపైకి బుల్డోజర్లు పంపండి

బీజేపీకి మమత సవాల్

కోల్‌కతా, నవంబర్ 7 (సమయం న్యూస్): తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీ ఇంటిపై బీజేపీ కార్యకర్తలు దాడి చేయడాన్ని బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ తీవ్రంగా ఖండించారు. తమకు ఎదురు తిరిగిన వారిపైకి బుల్డోజర్లు పంపడం భాజపాకు అలవాటని దుయ్యబట్టారు. వారి దగ్గర ఎన్ని బుల్డోజర్లు ఉంటే అన్నీ తనపైకి పంపాలని సవాల్ చేశారు. 'మీ దగ్గర ఎన్ని బుల్డోజర్లు ఉన్నాయి? రండి, నేను మీ ముందే నిల్చొని ఉన్నాను. నాపై బుల్డోజర్లను నడపండి. మీరెంత ధైర్యవంతులో చూడాలనుకుంటున్నాను' అని భాజపాపై విమర్శలు గుప్పించారు. అభిషేక్‌ను ఆయన నివాసంలో పరామర్శించిన అనంతరం మమత ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ.. తృణమూల్ నేతలపై దాడులు చేయడమే కాకుండా కాళీఘాట్ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా జరుగుతోన్న కాళీ పూజలకు అంతరాయం కలిగిస్తోందని మమత ఆరోపించారు. పలు ప్రాంతాల్లో పూజలు నిర్వహించడానికి అనుమతులు రద్దు చేశారని.. కొన్ని చోట్ల ప్రధాన రహదారులపై పూజ చేసుకునేందుకు అనుమతిచ్చారని అన్నారు. ఈ మార్పులు ఎందుకు చేయాల్సి వచ్చిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం తెల్లవారుజామున కాళీఘాట్‌లో ఉన్న తన నివాసంపై భాజపా కార్యకర్తలు రాళ్లు, ఇటుకలతో దాడి చేసినట్లు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీ ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మమత ఆయన్ని పరామర్శించారు.



భారత వాయుసేన ప్రపంచ రికార్డు!

- **13,629 అడుగుల ఎత్తులో భారీ రవాణా విమానం ల్యాండింగ్**
- **లద్దాఖ్‌లోని న్యోమా వైమానిక స్థావరంలో చరిత్ర సృష్టించిన ఐఎల్-76ఎండీ**
- **ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రాంతంలో ఈ తరహా విమానం ల్యాండింగ్**
- **అత్యంత క్లిష్టమైన వాతావరణంలోనూ సత్తాచాటిన భారత వైమానిక దళం**
- **చైనా సరిహద్దు సమీపంలో మరింత బలోపేతమైన వ్యూహాత్మక సామర్థ్యం**



న్యూఢిల్లీ, నవంబర్ 7 (సమయం న్యూస్): భారత వైమానిక దళం మరో అరుదైన ఘనత సాధించింది. సముద్ర మట్టానికి 13,629 అడుగుల ఎత్తులో భారీ రవాణా విమానాన్ని విజయవంతంగా దింపి సరికొత్త చరిత్ర సృష్టించింది. తూర్పు లద్దాఖ్‌లోని న్యోమా వైమానిక స్థావరంలో భారత వైమానిక దళానికి చెందిన ఐఎల్-76ఎండీ భారీ రవాణా విమానం సురక్షితంగా దిగింది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రాంతంలో ఈ తరహా విమానం ల్యాండింగ్ కావడం ఇదే తొలిసారని భారత వైమానిక దళం వెల్లడించింది. ఈ అద్భుత ఘట్టానికి సంబంధించిన చిత్రాలు, దృశ్యాలను సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పంచుకుంది. అత్యంత క్లిష్టమైన భౌగోళిక పరిస్థితుల్లో సాధించిన ఈ విజయం భారత వైమానిక దళ సాంకేతిక సామర్థ్యానికి, సిబ్బంది నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచిందని పేర్కొంది. సాధారణంగా సముద్ర మట్టానికి అత్యంత ఎత్తులో ఉన్న ప్రాంతాల్లో విమానాల రాకపోకలు సవాళ్లతో కూడుకుని ఉంటాయి. అక్కడ గాలి సాంద్రత తక్కువగా ఉండటంతో విమాన ఇంజిన్ల పనితీరు, విమానాన్ని నియంత్రించే సామర్థ్యం ప్రభావితమవుతాయి. ముఖ్యంగా భారీ రవాణా విమానాలను దించడం, తిరిగి గాల్లోకి తీసుకెళ్లడం మరింత క్లిష్టమైన ప్రక్రియ. ఇలాంటి పరిస్థితుల్లో 13,629 అడుగుల ఎత్తులో ఉన్న న్యోమా వైమానిక స్థావరంలో ఐఎల్-76ఎండీ విమానాన్ని విజయవంతంగా దించడం విశేషంగా నిలిచింది. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న పైలట్లు, సాంకేతిక సిబ్బంది ప్రదర్శించిన కచ్చితత్వం, సమన్వయం, వృత్తి నైపుణ్యాన్ని భారత వైమానిక దళం ప్రశంసించింది. తూర్పు లద్దాఖ్‌లోని న్యోమా ప్రాంతం భారత్-చైనా వాస్తవ నియంత్రణ రేఖకు సమీపంలో ఉండటంతో వ్యూహాత్మకంగా అత్యంత ప్రాధాన్యం కలిగిన ప్రాంతంగా గుర్తింపు పొందింది. సరిహద్దు ప్రాంతాల్లో సైనికుల తరలింపు, రక్షణ సామగ్రి రవాణా, అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలకు వైమానిక రవాణా కీలకంగా మారుతుంది. న్యోమా వంటి ఎత్తైన ప్రాంతాల్లో భారీ రవాణా విమానాలను నడపగల సామర్థ్యం పెరగడం ద్వారా సరిహద్దు ప్రాంతాలకు అవసరమైన సామగ్రిని మరింత సమర్థవంతంగా తరలించే అవకాశం ఉంటుంది. తాజా ల్యాండింగ్ భారత రక్షణ వ్యవస్థలో కీలక మైలురాయిగా నిలిచిందని వైమానిక దళం అభివర్ణించింది. ఐఎల్-76ఎండీ రష్యాలో రూపొందించిన నాలుగు ఇంజిన్ల భారీ రవాణా విమానం. సైనికులు, ఆయుధ సామగ్రి, వాహనాలు, ఇతర అవసరమైన సరకులను సుదూర ప్రాంతాలకు తరలించేందుకు దీనిని వినియోగిస్తారు. అత్యవసర పరిస్థితుల్లో భారీ స్థాయిలో సామగ్రిని తరలించగల సామర్థ్యం ఈ విమానం ప్రత్యేకత. మారుమూల ప్రాంతాల్లో సైనిక కార్యకలాపాలకు మద్దతు అందించడంలోనూ ఈ విమానాలు కీలక పాత్ర పోషిస్తాయి. న్యోమా వైమానిక స్థావరంలో భారీ రవాణా విమానం విజయవంతంగా దిగడం భారత వైమానిక దళానికి గర్వకారణమని అధికారులు పేర్కొన్నారు. ఈ ఘనత ద్వారా అత్యంత ఎత్తైన ప్రాంతాల్లోనూ సంక్లిష్టమైన వైమానిక కార్యకలాపాలు నిర్వహించగల సామర్థ్యాన్ని చాటుకున్నట్లు తెలిపారు. సిబ్బంది నైపుణ్యం, విమాన సామర్థ్యం, సమర్థవంతమైన ప్రణాళిక సమన్వయంతోనే ఈ విజయం సాధ్యమైందని వివరించారు.



పదవి చేపట్టకున్నా చంపేస్తారు!

ఇందిర మరణించిన రోజే రాజీవ్‌కు ప్రధాని బాధ్యతలు

వద్దని వేడుకున్నా.. వినలేదని సోనియా ఆవేదన

ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్'లో కీలక విషయాలు

కేంద్రంపై విమర్శలు ఉండటంతో వెనక్కి తగ్గిన 'పెంగ్విన్' సంస్థ

నవంబర్ పదో తేదీన 'హార్పర్ కాలిన్స్' ద్వారా మార్కెట్లోకి పుస్తకం

న్యూఢిల్లీ, నవంబర్ 7 (సమయం న్యూస్): మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్య, ఆ తర్వాత చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలను కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ తన ఆత్మకథలో వెల్లడించారు. ఇందిర హత్య జరిగిన రోజే రాజీవ్ గాంధీని ప్రధానిగా బాధ్యతలు చేపట్టాలని కోరినప్పుడు తనకు గుండెల్లో కత్తి దిగినంత బాధ కలిగిందని ఆమె గుర్తుచేసుకున్నారు. ప్రధాని పదవి చేపడితే ఆయన ప్రాణాలకు ప్రమాదం ఉంటుందని, ఆ బాధ్యతలు స్వీకరించవద్దని రాజీవ్‌ను వేడుకున్నట్లు తెలిపారు. అందుకు రాజీవ్ స్పందిస్తూ.. తాను ఆ పదవి చేపట్టకపోయినా తనను చంపేస్తారని చెప్పినట్లు ఆమె వివరించారు. సోనియా గాంధీ రాసిన 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకాన్ని హార్పర్ కాలిన్స్ ఇండియా సంస్థ ప్రచురిస్తోంది. నవంబర్ పదో తేదీన ఇది మార్కెట్లోకి రానుంది. ఈ పుస్తకంలోని కొన్ని భాగాలను బ్రిటన్ పత్రిక 'ది గార్డియన్' ప్రచురించడంతో ఇందిర హత్యకు సంబంధించిన జ్ఞాపకాలు మరోసారి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి.

టపాసుల శబ్దాలు అనుకున్నా..

1984 అక్టోబర్ 31న ఇందిరా గాంధీ తన నివాసం 1, సఫ్దర్ జంగ్ రోడ్‌లో భద్రతా సిబ్బంది కాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డారు. ఆ సమయంలో తాను విన్న పేలుళ్ల శబ్దాలు మొదట టపాసుల మాదిరిగా అనిపించాయని సోనియా రాశారు. పిల్లల నానీ ఒంగ్మూ ఆందోళనతో వచ్చి విషయం చెప్పడంతో తాను వెంటనే తోటవైపు పరుగెత్తినట్లు తెలిపారు. రక్తపు మడుగులో ఉన్న ఇందిరను తెల్ల అంబాసిడర్ కారులో ఆస్పత్రికి తరలిస్తుండగా చూశానని పేర్కొన్నారు. ఆస్పత్రికి వెళ్లే మార్గంలో భారీ ట్రాఫిక్ కారణంగా కారు నెమ్మదిగా కదిలిందని, కనీసం సైరన్ కూడా లేదని ఆమె గుర్తుచేసుకున్నారు. అక్కడికి చేరుకున్నాక రాజీవ్, పిల్లలు ఎక్కడ ఉన్నారనే ఆందోళన తనను వెంటాడిందన్నారు. అదే రోజు మధ్యాహ్నం రెండు గంటలకు వైద్యులు ఇందిర మరణాన్ని ప్రకటించడంతో తట్టుకోలేక ఏడ్చానని తెలిపారు. ఇంటికి చేరుకున్నాక రాహుల్, ప్రియాంక కన్నీళ్లతో తనను కౌగిలించుకున్నారని, దాదీకి ఏమైందని, పాపా ఎక్కడని ప్రశ్నించారని పుస్తకంలో భావోద్వేగంగా వివరించారు. తన ఆత్మకథ ప్రచురణ విషయంలో ఎదురైన పరిణామాలపైనా సోనియా స్పందించారు. కేంద్ర ప్రభుత్వంపై పుస్తకంలో చేసిన విమర్శల పట్ల పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా తీవ్ర అసౌకర్యానికి గురైందని ఆరోపించారు. తొలుత ప్రచురణపై ఆసక్తి చూపిన ఆ సంస్థ.. తర్వాత భారత్‌లో పుస్తకాన్ని విడుదల చేయలేమని వెనక్కి తగ్గడం తనకు నిరాశ కలిగించిందని ఆమె పేర్కొన్నారు.

సీబీఎస్ఈ ఎగ్జామ్స్.. షెడ్యూల్ వచ్చేసింది!

వచ్చే ఏడాది ఫిబ్రవరి 16 నుంచి 10, 12 తరగతుల పరీక్షలు

మార్చి 9తో ముగియనున్న పదో తరగతి పరీక్షలు

ఏప్రిల్ 9 వరకు కొనసాగనున్న 12వ తరగతి ఎగ్జామ్స్

వెబ్‌సైట్‌లో అందుబాటులో నమూనా ప్రశ్నపత్రాలు



న్యూఢిల్లీ, నవంబర్ 7 (సమయం న్యూస్): సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) 10, 12 తరగతుల బోర్డ్ ఎగ్జామ్ షెడ్యూల్‌ను అధికారికంగా విడుదల చేసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 16 నుంచి ఈ బోర్డు పరీక్షలు ప్రారంభం కానున్నట్లు వెల్లడించింది. పదో తరగతి పరీక్షలు మార్చి 9న ముగియనుండగా.. 12వ తరగతి పరీక్షలు ఏప్రిల్ 9 వరకు కొనసాగుతాయని బోర్డు స్పష్టం చేసింది. పరీక్షల పూర్తి డేట్ షీట్ల కోసం విద్యార్థులు సీబీఎస్ఈ డాట్ జీవోవీ డాట్ ఇన్ (ఎఎంవ.స్త్రశీఒ.అఅ) వెబ్‌సైట్‌ను చూడాలని సూచించింది. పదో తరగతి మేజర్ పేపర్ల తేదీలను సీబీఎస్ఈ ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 17న మ్యాథమేటిక్స్ (స్టాండర్డ్, బేసిక్), ఫిబ్రవరి 22న సైన్స్ పరీక్షలు జరగనున్నాయి. అలాగే ఫిబ్రవరి 26న ఇంగ్లిష్ (కమ్యూనికేటివ్, ల్యాంగ్వేజ్-లిటరేచర్), మార్చి 3న హిందీ (కోర్స్ ఏ, బీ) పరీక్షలను నిర్వహించనున్నారు. 12వ తరగతి విద్యార్థులకు ఫిబ్రవరి 16న ఫిజిక్స్ పరీక్షతో మేజర్ పేపర్లు మొదలవుతాయి. ఫిబ్రవరి 23న అకౌంటెన్సీ, 25న జాగ్రఫీ, 27న కెమిస్ట్రీ పరీక్షలు ఉంటాయి. మార్చి 2న సైకాలజీ, 5న ఇంగ్లిష్ (ఎలెక్టివ్, కోర్), 9న మ్యాథ్స్ (అప్లైడ్ మ్యాథ్స్), 13న హిందీ (ఎలెక్టివ్, కోర్), 16న ఎకనామిక్స్, 19న పొలిటికల్ సైన్స్, 20న ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) పరీక్షలు జరగనున్నాయి. మార్చి 25న బయోలజీ, 27న హిస్టరీ, 30న సోషియాలజీ, 31న కంప్యూటర్ సైన్స్, ఐటీ పరీక్షలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 1న బిజినెస్ స్టడీస్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ పరీక్షలు ఉంటాయి. పరీక్షల షెడ్యూల్‌తో పాటు 10, 12వ తరగతి విద్యార్థులకు ఉపయోగపడేలా నమూనా ప్రశ్నపత్రాలను కూడా బోర్డు విడుదల చేసింది. విద్యార్థులు సీబీఎస్ఈఅకడమిక్ డాట్ ఎన్ఐసీ డాట్ ఇన్ (ఎఎంఘఘిఎవఎఅఎ.అఅఎ.అఅ) అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఈ శాంపిల్ పేపర్లను చూసి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు.

సీఈసీ రాజీనామా చేయాల్సిందే!

- **కొచ్చికి విస్తరించిన కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనలు**
- **నిరసనలకు నేతృత్వం వహించిన నటుడు ప్రకాశ్ రాజ్**
- **ఓటర్ల జాబితాల సవరణను వెనక్కి తీసుకోవాలని డిమాండ్**
- **మెరైన్ డ్రైవ్ నుంచి రాజేంద్ర మైదాన్ వరకు భారీ ప్రదర్శన**



కొచ్చి, నవంబర్ 7 (సమయం న్యూస్): ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఉద్యమం శనివారం కేరళలోని కొచ్చికి విస్తరించింది. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'జంతర్ మంతర్ ఎట్ కొచ్చి' కార్యక్రమంలో ప్రముఖ నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాశ్ రాజ్ నేతృత్వంలో భారీ నిరసన ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారు ఐదు వందల మంది కార్యకర్తలు చురుగ్గా పాల్గొన్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. కొచ్చిలోని మెరైన్ డ్రైవ్ నుంచి రాజేంద్ర మైదాన్ వరకు నిరసనకారులు జాతీయ పతాకాలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డీవైఎఫ్ఐ) కేరళ రాష్ట్ర అధ్యక్షురాలు చింతా జెరోమ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. ప్రదర్శన మార్గంలో సాధారణ వాహనదారులకు, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని పర్యవేక్షించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే శనివారం మధ్యాహ్నం కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దేశంలో స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పనిచేసే ఎన్నికల వ్యవస్థ ఏర్పడే వరకు జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని ప్రకటించారు. ప్రస్తుత ప్రధాన ఎన్నికల కమిషనర్ హయాంలో ఎన్నికలు నిష్పక్షపాతంగా జరుగుతాయనే నమ్మకం ఏమాత్రం లేదని ఆయన ఆరోపించారు. కేవలం ఒక రాజకీయ పార్టీకి మాత్రమే ప్రయోజనం కలిగించేలా ఎన్నికల ప్రక్రియను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నారని ఆయన విమర్శించారు. కేరళ రాష్ట్రంలో తమ సంస్థకు యువత నుంచి గణనీయమైన స్థాయిలో మద్దతు లభిస్తోందని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. కొచ్చిలో జరుగుతున్న ఈ నిరసన కార్యక్రమానికి స్థానిక నిర్వాహకులు, నటుడు ప్రకాశ్ రాజ్ ప్రత్యేక ఆహ్వానం మేరకే తాను ఇక్కడికి వచ్చినట్లు ఆయన వివరించారు.

మారణకాండలో కూతురి పాత్ర?

- **బెంగళూరు సామూహిక హత్యల కేసులో విస్తుపోయే నిజాలు**
- **ఏడుగురి హత్యల్లో తండ్రికి సహకరించిందన్న కోణంలో విచారణ**



బెంగళూరు, నవంబర్ 7 (సమయం న్యూస్) : బెంగళూరులో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురి హత్య కేసులో రోజుకో కొత్త కోణం వెలుగులోకి వస్తోంది. ఈ దారుణ మారణకాండకు పాల్పడిన క్యాబ్ డ్రైవర్ ఇందుశేఖర్ అలియాస్ శేఖర్ 17 ఏళ్ల కుమార్తె పాత్రపైనా పోలీసులు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. హత్యలకు ప్రణాళిక రూపొందించడం మొదలు ఆధారాలు చెరిపివేయడం వరకు ఆమె తన తండ్రికి పూర్తిగా సహకరించినట్లు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ బాలికను అదుపులోకి తీసుకున్న పోలీసులు ముమ్మరంగా విచారిస్తున్నారు.

ఆస్తి కోసమేనంటూ బ్రెయిన్ వాష్..

పోలీసుల విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. ప్రధాన నిందితుడు ఇందుశేఖర్ తన కుమార్తెను మానసికంగా తీవ్రంగా ప్రభావితం చేసి ఈ దారుణ నేరంలో భాగస్వామిని చేసినట్లు తెలుస్తోంది. తన భార్యతో పాటు కుటుంబ సభ్యులంతా తమకు బద్ధ శత్రువులని, వారిని అంతమొందిస్తే ఆస్తి మొత్తం తమకే దక్కుతుందని ఆమెను నమ్మించి దారుణానికి ఒడిగట్టినట్లు సమాచారం.

విందు పేరుతో ఇంటికి ఆహ్వానం..

ముందుగా తన భార్య సునీతను దారుణంగా హత్య చేసిన అనంతరం కుటుంబంలోని ఇతర సభ్యులను ఇంటికి రప్పించేందుకు నిందితుడు తన కుమార్తెతోనే ఫోన్లు చేయించినట్లు పోలీసులు భావిస్తున్నారు. నానమ్మ రూపావతితో పాటు పిన్నులు, బాబాయ్‌ల కుటుంబాలను విందు పేరుతో ఇంటికి ఆహ్వానించినట్లు అనుమానిస్తున్నారు. ఆ సమయంలో తల్లి ఊరికి వెళ్లిందని చెప్పి బంధువులను ఆ బాలిక నమ్మించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది.

ఆధారాల చెరిపివేత.. మృతదేహాల తరలింపు..

అక్టోబర్ 16 నుంచి 31 మధ్య సుమారు పదిహేను రోజుల వ్యవధిలో ఏడుగురిని వేర్వేరు సందర్భాల్లో ఇంటికి రప్పించి ఇందుశేఖర్ దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ప్రతి హత్య అనంతరం ఘటనాస్థలంలో రక్తపు మరకలను శుభ్రం చేయడం, ఇతర ఆధారాలను తొలగించడంలో కుమార్తె అతనికి సహకరించినట్లు ఆరోపణలున్నాయి. మృతదేహాలను ప్యాక్ చేసి కారులో వేర్వేరు ప్రాంతాలకు తరలించి పడేయడంలోనూ ఆమె పాత్రపై దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను తరలించేటప్పుడు కారులో కుమార్తె కూడా ఉంటే పోలీసులకు ఎలాంటి అనుమానం రాదనే ఉద్దేశంతోనే నిందితుడు ఆమెను వెంట తీసుకెళ్లినట్లు భావిస్తున్నారు.

మృతుల ఫోన్ల నుంచి మెసేజ్‌లు..

మరోవైపు హత్యకు గురైన వారి మొబైల్ ఫోన్లను నిందితులు తమ వద్దే ఉంచుకుని, వారు క్షేమంగా ఉన్నట్లు ఇతరులకు సందేశాలు పంపినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. తాము విహారయాత్రకు వెళ్లామని, అంతా బాగానే ఉన్నామని మృతుల ఫోన్ల నుంచి మెసేజ్‌లు పంపుతూ హత్యల విషయం బయటపడకుండా జాగ్రత్తపడినట్లు సమాచారం. ఈ మెసేజ్‌లు పంపడంలో నూ బాలిక తండ్రికి సహకరించిందా అనే కోణంలో పోలీసులు లోతుగా విచారణ కొనసాగిస్తున్నారు.

కారు పార్కింగ్ కోసం ప్రాణాలు తీశాడు!

- **ఫరీదాబాద్‌లో మాజీ టెక్ అధికారి దారుణ హత్య**
- **లైసెన్స్‌డ్ పిస్టల్‌తో 15 రౌండ్లు కాల్చిన పొరుగింటి వ్యక్తి**
- **9 బుల్లెట్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందిన పరమ్‌జీత్**
- **మేనల్లుడి పెళ్లి కోసం సింగపూర్ నుంచి వచ్చిన వైనం**
- **ఘటనాస్థలం నుంచి పరారైన నిందితుడు మోను శర్మ**



ఫరీదాబాద్, నవంబర్ 7 (సమయం న్యూస్): పార్కింగ్ స్థలం విషయంలో తలెత్తిన చిన్న వివాదం ఏకంగా ఓ వ్యక్తి ప్రాణాలను బలిగొంది. హర్యానాలోని ఫరీదాబాద్‌లో టెక్ రంగానికి చెందిన సీనియర్ అధికారి పరమ్‌జీత్ ధన్‌ఖర్ తన పొరుగింటి వ్యక్తి జరిపిన కాల్పుల్లో దారుణంగా ప్రాణాలు కోల్పోయారు. తన మేనల్లుడి వివాహానికి హాజరయ్యేందుకు సింగపూర్ నుంచి వచ్చిన ఆయనపై నిందితుడు విచక్షణారహితంగా తన లైసెన్స్‌డ్ పిస్టల్‌తో ఏకంగా 15 రౌండ్లు కాల్పులు జరిపాడు. వీటిలో తొమ్మిది బుల్లెట్లు శరీరంలోకి దూసుకుపోవడంతో పరమ్‌జీత్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు.

కారు తీయమన్నందుకు..

పోలీసుల కథనం ప్రకారం.. పరమ్‌జీత్ గతంలో టెక్ మహీంద్రా ఆసియా కార్యకలాపాలకు నాయకత్వం వహించారు. ఆయన ప్రస్తుతం వియత్నాంకు చెందిన ఓ సంస్థలో సీనియర్ అధికారిగా పనిచేస్తున్నారు. తన మేనల్లుడి పెళ్లి కోసం రెండు రోజుల క్రితమే ఆయన ఫరీదాబాద్‌కు చేరుకున్నారు. శుక్రవారం రాత్రి జిమ్ నుంచి ఇంటికి తిరిగి వచ్చిన ఆయనకు తన పార్కింగ్ స్థలంలో పొరుగింటి వ్యక్తి మోహన్ అలియాస్ మోను శర్మ కారు కనిపించింది. అక్కడి నుంచి కారును తొలగించాలని పరమ్‌జీత్ కోరడంతో ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం మొదలైంది.

15 రౌండ్ల కాల్పులు.. పాత కక్షలు

ఈ క్రమంలో తీవ్ర ఆగ్రహానికి గురైన మోహన్ తన వద్ద ఉన్న లైసెన్స్‌డ్ పిస్టల్‌తో పరమ్‌జీత్‌పై విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు పోలీసులు వెల్లడించారు. గతంలోనూ పెంపుడు కుక్కను పార్కింగ్ ప్రదేశంలోకి తీసుకురావడం సహా ఇతర చిన్నచిన్న అంశాలపై ఇరు కుటుంబాల మధ్య పలుమార్లు గొడవలు జరిగినట్లు వారు తెలిపారు. పార్కింగ్ స్థలం గొడవకు పాత కక్షలు కూడా తోడవడంతోనే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు అనుమానిస్తున్నారు.

పరారీలో నిందితుడు.. ముమ్మర గాలింపు

కాల్పుల అనంతరం నిందితుడు మోహన్ తన కుటుంబ సభ్యులతో కలిసి అక్కడి నుంచి పారిపోయాడు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితులను పరిశీలించారు. క్రైమ్ బ్రాంచ్, ఫోరెన్సిక్ బృందాలు అక్కడికి చేరుకుని ఖాళీ తూటాలను సేకరించాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం పరారీలో ఉన్న మోహన్ కోసం ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దించి ముమ్మరంగా గాలిస్తున్నారు.



విలక్షణ నటుడు తుత్తి సుబ్రహ్మణ్యం

నేడు ఆమంచి వెంకట సుబ్రహ్మణ్యం వర్ధంతి

కొందరు నటులు తమ నటనతో నవ్విస్తారు. మరికొందరు తమ హావభావాలతో అలరిస్తారు. ఇంకొందరు పలికే ఒక్క మాటతోనే ప్రేక్షకుల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోతారు. అలాంటి అరుదైన హాస్య నటుల్లో ఆమంచి వెంకట సుబ్రహ్మణ్యం ఒకరు. తెలుగు సినీ ప్రేక్షకులకు ఏవీఎస్‌గా సుపరిచితుడైన ఆయన 'తుత్తి' అనే ఒక్క పదంతోనే ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. విలక్షణమైన సంభాషణల ఉచ్చారణ, విభిన్నమైన హావభావాలు, సహజమైన నటనతో తెలుగు చలనచిత్ర రంగంలో తనదైన ముద్ర వేశారు. రంగస్థల నటుడిగా ప్రారంభమైన ఆయన కళాప్రస్థానం మిమిక్రీ కళాకారుడిగా, పాత్రికేయుడిగా, సినీనటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా విస్తరించింది. 2013 నవంబర్ 8న కన్నుమూసిన ఏవీఎస్ వర్ధంతి సందర్భంగా ఆయన కళాప్రస్థానాన్ని మరోసారి స్మరించుకోవాల్సిన సందర్భమిది. ఏవీఎస్ 1957 జనవరి 2న గుంటూరు జిల్లా తెనాలిలో వీరరాఘవయ్య, శివకామేశ్వరి దంపతులకు జన్మించారు. తెనాలిలోని వీఎస్ఆర్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. కళాశాల రోజుల్లోనే రంగస్థలంపై అడుగుపెట్టి నాటకాల్లో విభిన్న పాత్రలు పోషించారు. రసమయి సంస్థను ఏర్పాటు చేసి నవరస ప్రదర్శనలు నిర్వహించారు. మిమిక్రీ కళాకారుడిగా కూడా ప్రత్యేక గుర్తింపు పొందారు. లలిత కళా సమాఖ్య ద్వారా కళా కార్యక్రమాలు, ప్రముఖుల సన్మాన సభలు నిర్వహించారు. అనంతరం పాత్రికేయ రంగంలోకి ప్రవేశించి ఉదయం, ఆంధ్రజ్యోతి పత్రికల్లో విలేకరిగా, ఉపసంపాదకుడిగా పనిచేశారు. ఈ క్రమంలో దర్శకుడు బాపు దృష్టిలో పడటంతో సినీరంగ ప్రవేశానికి మార్గం సుగమమైంది. ఎన్టీఆర్ నిర్మించిన 'శ్రీనాథ కవిసార్వభౌముడు' చిత్రంలో నటించినప్పటికీ, ముందుగా విడుదలైన 'మిస్టర్ పెళ్లాం' (1993) చిత్రంతో ఏవీఎస్ ప్రేక్షకులకు పరిచయమయ్యారు. తొలి చిత్రంతోనే ఉత్తమ హాస్య నటుడిగా నంది పురస్కారాన్ని అందుకున్నారు. ఈ చిత్రంలో ఆయన పలికిన 'తుత్తి' అనే పదం విశేష ఆదరణ పొందింది. 'ఘటోత్కచుడు' చిత్రంలోని 'రంగుపడుద్ది', 'శుభలగ్నం' చిత్రంలోని 'గాలి కనపడుతుందా' వంటి సంభాషణలు కూడా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మాటల ఉచ్చారణ, ముఖ కవళికలు, శరీర భాషతో హాస్యాన్ని పండించడంలో ఏవీఎస్ తనకంటూ ప్రత్యేక శైలిని ఏర్పరచుకున్నారు. దాదాపు 19 ఏళ్ల సినీ ప్రస్థానంలో ఏవీఎస్ సుమారు 500 చిత్రాల్లో నటించారు. 'మాయలోడు', 'మేడమ్', 'ఆమె', 'శుభలగ్నం', 'యమలీల', 'వినోదం', 'సమరసింహారెడ్డి', 'ఇంద్ర', 'ధర్మచక్రం', 'గంగోత్రి', 'శివమణి', 'వెంకీ', 'శ్రీరామదాసు', 'జై చిరంజీవ', 'కింగ్', 'బెండు అప్పారావు', 'ఝుమ్మంది నాదం' వంటి చిత్రాల్లో విభిన్న పాత్రలతో మెప్పించారు. హాస్య పాత్రలతోపాటు సహాయ నటుడిగా, ప్రతినాయక ఛాయలున్న పాత్రల్లోనూ రాణించారు. పౌరాణిక చిత్రాల్లో శకుని, నారదుడు వంటి పాత్రలను పోషించారు. 'పవిత్ర' ఆయన చివరి చిత్రంగా గుర్తింపు పొందింది. నటనతోపాటు దర్శకత్వం, నిర్మాణం, రచన రంగాల్లోనూ ఏవీఎస్ ప్రతిభ చాటుకున్నారు. 'అంకుల్', 'ఓరి నీ ప్రేమ బంగారం కానూ' చిత్రాలను నిర్మించారు. 'సూపర్ హీరోస్', 'రూమ్‌మేట్స్', 'కోతిమూక' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు. 'మిస్టర్ పెళ్లాం', 'అంకుల్', 'కోతిమూక' చిత్రాలకు వివిధ విభాగాల్లో నంది పురస్కారాలు అందుకున్నారు. మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా మూడుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికై కళాకారులకు సేవలందించారు. సినీరంగంలో ఎంతటి గుర్తింపు సంపాదించినా ఏవీఎస్ తన జన్మస్థలమైన తెనాలిని మరువలేదు. తెనాలికి కళల రాజధానిగా గుర్తింపు తీసుకురావాలని నిరంతరం తపించారు. అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలను తెనాలిలో నిర్వహించేందుకు కృషి చేశారు. సినీ ప్రముఖులను రప్పించి కళా కార్యక్రమాలు, సన్మాన సభలు నిర్వహించారు. కళాకారులను ప్రోత్సహించడంతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. భారీ వైద్య శిబిరాల నిర్వహణ ద్వారా వేలాది మందికి ఉచిత వైద్య సేవలు అందించేందుకు కృషి చేశారు. రాజకీయాలపైనా ఆసక్తి చూపిన ఆయన తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధిగా పనిచేశారు.

నవ్వులు మిగిల్చి.. జ్ఞాపకంగా నిలిచి

1980లో ఆశాకిరణ్మయిని ప్రేమ వివాహం చేసుకున్న ఏవీఎస్ కుటుంబ జీవితంతోపాటు కళారంగంలోనూ తన ప్రస్థానాన్ని కొనసాగించారు. 2008లో కాలేయ సంబంధిత అనారోగ్యంతో బాధపడగా కుమార్తె కాలేయ దానంతో మార్పిడి శస్త్రచికిత్స జరిగింది. అనంతరం కోలుకుని తిరిగి సినిమాల్లో నటించారు. అయితే కాలేయ సమస్యలు మళ్లీ తీవ్రం కావడంతో 2013 నవంబర్ 8న మణికొండలోని తన కుమారుడు ప్రదీప్ నివాసంలో కన్నుమూశారు. రంగస్థల నటుడిగా, మిమిక్రీ కళాకారుడిగా, పాత్రికేయుడిగా, హాస్య నటుడిగా, దర్శక నిర్మాతగా ఎన్నో రంగాల్లో తన ప్రతిభను చాటుకున్న ఏవీఎస్ తెలుగు సినీ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆయన భౌతికంగా దూరమైనా 'తుత్తి' అంటూ పండించిన నవ్వులు తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

ప్రణాళికాబద్ధమైన పట్టణాలే ప్రగతికి పునాదులు!

నేడు ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవం



ఆకాశాన్ని తాకే భవనాలు.. విశాలమైన రహదారులు.. అత్యాధునిక నిర్మాణాలు.. ఇవి మాత్రమే పట్టణాభివృద్ధికి కొలమానాలు కావు. ప్రతి పౌరుడికి సురక్షితమైన నివాసం, స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన రవాణా, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నప్పుడే నిజమైన పట్టణాభివృద్ధి సాధ్యమవుతుంది. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా నగరాలను తీర్చిదిద్దడంతోపాటు పర్యావరణ సమతుల్యతను కాపాడటం కూడా అత్యంత అవసరం. ఈ లక్ష్యాలను ప్రపంచానికి గుర్తుచేస్తూ ప్రతి సంవత్సరం నవంబర్ 8న ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవాన్ని నిర్వహిస్తారు. పట్టణాలు, నగరాలను ఆరోగ్యకరమైన, సురక్షితమైన, ఆర్థికంగా బలమైన నివాస ప్రాంతాలుగా అభివృద్ధి చేయడంలో ప్రణాళికల ప్రాధాన్యాన్ని తెలియజేయడమే ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశం.

పట్టణాలు, నగరాల ప్రస్తుత అవసరాలతోపాటు భవిష్యత్తులో పెరిగే జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించడమే పట్టణ ప్రణాళిక. భూమి వినియోగం, నివాస ప్రాంతాల ఏర్పాటు, రహదారుల నిర్మాణం, ప్రజా రవాణా వ్యవస్థ, తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల, విద్యుత్, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, పార్కులు, పారిశ్రామిక ప్రాంతాల అభివృద్ధి వంటి అనేక అంశాలు ఇందులో భాగంగా ఉంటాయి. పట్టణాలు అస్తవ్యస్తంగా విస్తరించకుండా నియంత్రిత పద్ధతిలో అభివృద్ధి చెందేలా చూడటంలో ప్రణాళికలు కీలక పాత్ర పోషిస్తాయి. సరైన ప్రణాళిక లేకుండా విస్తరించే నగరాల్లో ట్రాఫిక్ సమస్యలు, నీటి కొరత, కాలుష్యం, మురుగునీటి సమస్యలు, నివాస స్థలాల కొరత వంటి ఇబ్బందులు తలెత్తే ప్రమాదముంది. ఉపాధి, విద్య, వైద్య సదుపాయాలు, వ్యాపార అవకాశాల కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలసలు పెరుగుతున్నాయి. దీంతో నగరాలపై జనాభా ఒత్తిడి అధికమవుతోంది. జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు విస్తరించకపోతే ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ముఖ్యంగా నివాస గృహాల కొరత, ట్రాఫిక్ రద్దీ, తాగునీటి సమస్య, పారిశుద్ధ్య లోపాలు, చెత్త నిర్వహణ వంటి అంశాలు పట్టణ పాలనకు సవాళ్లుగా మారుతున్నాయి. వీటిని అధిగమించేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉంది. భవిష్యత్తులో జనాభా ఎంత పెరుగుతుంది, అందుకు ఎన్ని నివాసాలు అవసరం, రవాణా వ్యవస్థను ఎలా విస్తరించాలి, నీటి వనరులను ఎలా వినియోగించుకోవాలి వంటి అంశాలను ముందుగానే అంచనా వేయాలి. పట్టణాల్లో నివసించే ప్రతి ఒక్కరికీ కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడటం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత. రహదారుల నిర్మాణంతోపాటు నాణ్యమైన ప్రజా రవాణా వ్యవస్థ, నిరంతర తాగునీటి సరఫరా, సమర్థవంతమైన మురుగునీటి పారుదల, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలి. పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు, క్రీడా మైదానాలు, ఉద్యానవనాలు వంటి సదుపాయాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. పట్టణాల విస్తరణలో కేవలం వాణిజ్య భవనాలు, నివాస సముదాయాల నిర్మాణంపైనే కాకుండా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే సదుపాయాల కల్పనపైనా దృష్టి సారించాలి. పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ అత్యంత కీలకంగా మారింది. చెట్ల నరికివేత, చెరువుల ఆక్రమణ, వాయు కాలుష్యం, నీటి వనరుల కలుషితం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు పట్టణాల భవిష్యత్తును ప్రభావితం చేస్తున్నాయి. వీటిని నియంత్రించేందుకు పట్టణ ప్రణాళికలో పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక స్థానం కల్పించాలి. చెరువులు, కుంటలు, సహజ నీటి ప్రవాహ మార్గాలను సంరక్షించడంతోపాటు ఉద్యానవనాలు, పచ్చని ప్రదేశాలను విస్తరించాలి. వర్షపు నీటిని సంరక్షించడం, భూగర్భ జలాలను పెంపొందించడం, వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడం వంటి చర్యలను ప్రోత్సహించాలి. ప్రకృతికి అనుకూలమైన అభివృద్ధి విధానాలను అనుసరించినప్పుడే పట్టణాలు భవిష్యత్తు తరాలకు నివాసయోగ్యంగా నిలుస్తాయి. పట్టణాభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు అందాలి. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు, మహిళలు, చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పట్టణాలను అభివృద్ధి చేయాలి. పేదలకు అందుబాటు ధరల్లో నివాస సదుపాయాలు, ప్రభుత్వ విద్యాసంస్థలు, వైద్య సేవలు, రవాణా సౌకర్యాలు కల్పించడం ద్వారా సామాజిక అసమానతలను తగ్గించవచ్చు. ప్రతి పౌరుడు సురక్షితంగా ప్రయాణించేందుకు అనువైన రహదారులు, కాలిబాటలు, ప్రజా రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయాలి. అభివృద్ధి కొన్ని ప్రాంతాలకే పరిమితం కాకుండా పట్టణంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించేలా ప్రణాళికలు రూపొందించాలి. ప్రణాళికాబద్ధమైన పట్టణాభివృద్ధి ఆర్థిక ప్రగతికి కూడా దోహదపడుతుంది. మెరుగైన రవాణా, విద్యుత్, నీటి సరఫరా, సమాచార వ్యవస్థలు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో పరిశ్రమలు, వాణిజ్య కేంద్రాలు, పారిశ్రామిక ప్రాంతాలు, నివాస సముదాయాల మధ్య సమన్వయం ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తే ప్రజల ప్రయాణ సమయం, రవాణా వ్యయాలు తగ్గే అవకాశం ఉంటుంది. పట్టణాల ఆర్థికాభివృద్ధితోపాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు ఇది దోహదం చేస్తుంది. పట్టణ ప్రణాళిక కేవలం ప్రభుత్వాలు, అధికారుల బాధ్యత మాత్రమే కాదు. ప్రజల భాగస్వామ్యం కూడా అంతే అవసరం. పట్టణాల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించడం, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో అభిప్రాయాలు తెలియజేయడం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి చర్యల ద్వారా పౌరులు పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావచ్చు. స్థానిక సంస్థలు, పట్టణ ప్రణాళిక నిపుణులు, పర్యావరణ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పౌరులు సమన్వయంతో పనిచేసినప్పుడే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుంది. పట్టణాల అభివృద్ధి అనేది కేవలం నేటి అవసరాలను తీర్చే ప్రక్రియ కాదు. రాబోయే తరాలకు మెరుగైన జీవన వాతావరణాన్ని అందించే బాధ్యత కూడా. వాతావరణ మార్పులు, జనాభా పెరుగుదల, సహజ వనరుల కొరత వంటి సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం ఉన్న నగరాలను నిర్మించాలి. ఇందుకోసం దీర్ఘకాలిక దృష్టితో ప్రణాళికలు రూపొందించి వాటిని సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది.

- మౌలిక సదుపాయాల కల్పనతోనే నగరాల సమగ్రాభివృద్ధి
- పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పట్టణాల విస్తరణ అవసరం
- రవాణా, తాగునీరు, పారిశుద్ధ్యం, నివాస వసతులకు ప్రాధాన్యం
- పర్యావరణ పరిరక్షణతోనే సుస్థిర పట్టణాల నిర్మాణం
- ప్రజలందరికీ సమాన అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యం

ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ పట్టణాల భవిష్యత్తుపై ఆలోచించాల్సిన అవసరం ఉంది. కాంక్రీటు కట్టడాల విస్తరణ మాత్రమే అభివృద్ధి కాదని, ప్రజలకు కనీస సదుపాయాలు కల్పించడంతోపాటు ప్రకృతిని కాపాడటమే నిజమైన ప్రగతికి నిదర్శనమని గుర్తించాలి. నేటి ప్రణాళికలే రేపటి నగరాల రూపురేఖలను నిర్ణయిస్తాయి. ప్రణాళికాబద్ధమైన పట్టణాల నిర్మాణమే ఆరోగ్యకరమైన సమాజానికి, సుస్థిరమైన భవిష్యత్తుకు బలమైన పునాది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

ఎక్స్ కిరణాల ఆవిష్కర్త రాంట్జెన్

నేడు అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవం!

ఆధునిక ఆరోగ్య సంరక్షణలో వ్యాధి నిర్ధారణకు అత్యంత కీలకమైన 'అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవం' ప్రతి సంవత్సరం నవంబర్ 8న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా నిర్వహించబడుతోంది. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఎక్స్-కిరణాలను జర్మన్ భౌతిక శాస్త్రవేత్త విల్హేల్మ్ కన్రాడ్ రాంట్జెన్ 1895 నవంబర్ 8న కనుగొన్నారు. ఆయన చేసిన ఈ చారిత్రాత్మక ఆవిష్కరణకు గుర్తుగా రేడియోలాజికల్ సొసైటీ ఆఫ్ నార్త్ అమెరికా ఆధ్వర్యంలో నవంబర్ 8వ తేదీని అధికారిక రేడియాలజీ దినోత్సవంగా ప్రకటించారు.



ఎక్స్-రే ఆవిష్కరణ వెనుక ఆసక్తికర కథనం

విల్హేల్మ్ కన్రాడ్ రాంట్జెన్ (మార్చి 27, 1845 – ఫిబ్రవరి 10, 1923) జర్మనీలోని లెన్నెప్ లో జన్మించారు. జ్యురిచ్ విశ్వవిద్యాలయం నుంచి పి.హెచ్.డి పట్టా పొందిన ఆయన, వివిధ విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్‌గా సేవలందించారు. 1895 నవంబర్ 8న ఆయన కేథోడ్ రే ట్యూబ్ (శూన్య గాజు నాళం) తో ప్రయోగాలు చేస్తున్న సమయంలో ఒక అద్భుతం గమనించారు. ట్యూబ్ చుట్టూ నల్లని కాగితాన్ని కప్పి ఉంచినప్పటికీ, సమీపంలో ఉన్న బేరియం ప్లాటినో సైనైడ్ స్ఫటికం వింత మెరుపులతో ప్రకాశించడం ప్రారంభించింది. కాథోడ్ ట్యూబ్ నుంచి వెలువడిన అజ్ఞాత కిరణాలు కాగితం, చెక్క, లోహపు పలకల గుండా కూడా ప్రయాణించగలవని ఆయన నిరూపించారు. మనుషుల కళ్ళకు కనిపించని ఈ కిరణాలను ఆయన 'ఎక్స్-కిరణాలు' అని పేరు పెట్టారు. తన భార్య చేతిని ఫోటోగ్రాఫిక్ ప్లేట్ మీద ఉంచి ఈ కిరణాలను ప్రసారం చేయగా, ఉంగరంతో సహా చేతి ఎముకల పంజరం స్పష్టంగా ముద్రితం కావడంతో వైద్య రంగంలో సరికొత్త శకం ప్రారంభమైంది. ఎక్స్ కిరణాల ద్వారా మానవాళికి ఎంతో మేలు జరుగుతుందని భావించిన రాంట్జెన్, తన ఆవిష్కరణకు ఎక్కడా పేటెంట్ హక్కులు తీసుకోలేదు. మానవాళికి తన పరిశోధన ఫలితాలు ఉచితంగా అందాలని, ఈ కిరణాలకు తన పేరు కూడా పెట్టరాదని కోరుకున్నారు. 1901లో ఆయనకు భౌతిక శాస్త్రంలో మొట్టమొదటి నోబెల్ బహుమతి లభించగా, ఆ బహుమతి ద్వారా వచ్చిన పూర్తి ఆర్థిక ప్రతిఫలాన్ని వర్జ్ బర్గ్ విశ్వవిద్యాలయానికే విరాళంగా అందజేశారు. తొలి ప్రపంచ యుద్ధం సమయంలో ఏర్పడిన ద్రవ్యోల్బణం కారణంగా చివరి రోజుల్లో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, ఆయన తన నిస్స్వార్థ తత్వాన్ని వీడలేదు. వైద్య రంగంలో రోగ నిర్ధారణకు (రేడియోగ్రఫీ), రోగ నిర్మూలనకు (రేడియో థెరపీ) ఈ కిరణాలు మూలస్తంభంగా నిలిచాయి. వైద్య రంగంతో పాటు భద్రతా రంగంలోనూ ఇవి విస్తృతంగా ఉపయోగపడుతున్నాయి. ఆయన చేసిన అమూల్యమైన సేవలకు గౌరవార్థంగా ఆవర్తన పట్టికలోని 111 పరమాణు సంఖ్య గల మూలకానికి 'రాంట్జెనీయం' అని పేరు పెట్టి IUPAC సంస్థ ఘనంగా గౌరవించింది. రేడియాలజీ దినోత్సవ సందర్భంగా మానవాళికి విప్లవాత్మక వైద్య వరాన్ని అందించిన మహనీయుడు విల్హేల్మ్ రాంట్జెన్‌ను ప్రపంచం స్మరించుకుంటోంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

ఉత్కంఠ పోరులో భారత్‌దే పైచేయి!

న్యూజిలాండ్‌పై నాలుగు పరుగుల తేడాతో విజయం



- వర్షం అంతరాయంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ఫలితం
- ఐదు వన్డేల సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో టీమిండియా
- 134 పరుగులకే కుప్పకూలిన కివీస్ బ్యాటింగ్
- నాలుగు వికెట్లతో చెలరేగిన గుర్నూర్ బ్రార్
- 113 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయినా భారత్‌కు విజయం

వెల్లింగ్టన్, నవంబర్ 7 (సమయం న్యూస్): న్యూజిలాండ్‌తో జరిగిన రెండో వన్డేలో భారత్ ఉత్కంఠ విజయాన్ని అందుకుంది. వర్షం అంతరాయం కలిగించిన ఈ పోరులో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం నాలుగు పరుగుల తేడాతో గెలుపొందినట్లు మ్యాచ్ వివరాలు వెల్లడిస్తున్నాయి. తొలుత భారత బౌలర్ల ధాటికి న్యూజిలాండ్ 41 ఓవర్లలో 134 పరుగులకే ఆలౌటైంది. అనంతరం 135 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ కూడా కివీస్ బౌలర్ల ధాటికి తడబడింది. ఏడు వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసిన సమయంలో వర్షం ఆటకు అంతరాయం కలిగించింది. వర్షం కారణంగా ఆట తిరిగి కొనసాగించే పరిస్థితి లేకపోవడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ఫలితాన్ని నిర్ణయించారు. ఈ విజయంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.



భారత బౌలర్ల విజృంభణ

టాస్ గెలిచిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. భారత బౌలర్లు ఆరంభం నుంచే కట్టుదిట్టంగా బంతులు సంధించి న్యూజిలాండ్ బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టారు. అర్ష్‌దీప్ సింగ్ తొలి ఓవర్‌ను పరుగులేమీ ఇవ్వకుండా పూర్తి చేయగా, రెండో ఓవర్‌లో ఆకిబ్ నబీ టిమ్ సీఫర్ట్‌ను పరుగుల ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు పంపించాడు. ఆ తర్వాత విల్ యంగ్ (6)ను కూడా నబీ ఔట్ చేశాడు. హెన్రీ నికోల్స్ (11)ను అన్షుల్ కాంబోజ్ బౌల్డ్ చేయడంతో న్యూజిలాండ్ 19 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

53 పరుగులకే ఐదు వికెట్లు

ఆరంభంలోనే మూడు వికెట్లు కోల్పోయిన న్యూజిలాండ్‌ను ఆదుకునేందుకు డారిల్ మిచెల్ ప్రయత్నించాడు. టామ్ లాథమ్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దేందుకు కృషి చేశాడు. అయితే గుర్నూర్ బ్రార్ బౌలింగ్‌లో లాథమ్ (7) ఔటయ్యాడు. అదే ఓవర్‌లో గ్లెన్ ఫిలిప్స్‌ను పరుగులేమీ చేయకుండానే పెవిలియన్‌కు పంపించడంతో కివీస్ 53 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. భారత బౌలర్ల ధాటికి న్యూజిలాండ్ బ్యాటింగ్ క్రమం కుప్పకూలింది.

మిచెల్ ఒంటరి పోరాటం

ఒకవైపు వికెట్లు పడుతున్నా డారిల్ మిచెల్ మాత్రం పట్టుదలతో బ్యాటింగ్ చేశాడు. మిచెల్ శాంట్నర్‌తో కలిసి ఆరో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. మిచెల్ 104 బంతుల్లో 55 పరుగులు చేసి అర్ధశతకంతో జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. శాంట్నర్ 38 బంతుల్లో 31 పరుగులు చేసి సహకరించాడు. అయితే అక్షర్ పటేల్ బౌలింగ్‌లో మిచెల్ ఔటవడంతో న్యూజిలాండ్ మళ్లీ ఒత్తిడిలో పడింది. అనంతరం గుర్నూర్ బ్రార్ శాంట్నర్‌ను పెవిలియన్‌కు పంపించాడు. చివర్లో కైల్ జేమీసన్ (7)ను అక్షర్ పటేల్ బౌల్డ్ చేయగా, నాథన్ స్మిత్ (3)ను గుర్నూర్ బ్రార్ ఔట్ చేశాడు. బ్లెయిర్ టిక్నర్ (2)ను అన్షుల్ కాంబోజ్ బౌల్డ్ చేయడంతో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 41 ఓవర్లలో 134 పరుగుల వద్ద ముగిసింది. భారత బౌలర్లలో గుర్నూర్ బ్రార్ 10 ఓవర్లలో 30 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఆకిబ్ నబీ, అక్షర్ పటేల్, అన్షుల్ కాంబోజ్ రెండేసి వికెట్లు సాధించారు.

స్వల్ప లక్ష్యానికీ భారత్ తడబాటు

135 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు కూడా వెల్లింగ్టన్ పిచ్‌పై కష్టాలు తప్పలేదు. బౌలర్లకు అనుకూలించిన పరిస్థితుల్లో భారత బ్యాటర్లు పరుగులు సాధించేందుకు ఇబ్బందిపడ్డారు. రోహిత్ శర్మ 23 పరుగులు చేయగా, శ్రేయాస్ అయ్యర్ 30 పరుగులతో రాణించాడు. కేఎల్ రాహుల్ 26 పరుగులతో అజేయంగా నిలిచాడు. న్యూజిలాండ్ బౌలర్లలో కైల్ జేమీసన్, జాకబ్ డఫీ చెరో మూడు వికెట్లు పడగొట్టి భారత్‌ను ఒత్తిడిలోకి నెట్టారు. దీంతో స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలోనే భారత్ ఏడు వికెట్లు కోల్పోయింది.

వర్షమే ఫలితాన్ని తేల్చింది

భారత్ ఏడు వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసిన సమయంలో వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోయింది. అప్పటికి డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో నిర్ణయించిన లక్ష్యాన్ని భారత్ అధిగమించినట్లు మ్యాచ్ వివరాలు పేర్కొంటున్నాయి. దీంతో నాలుగు పరుగుల తేడాతో టీమిండియాను విజేతగా ప్రకటించినట్లు సమాచారం. కివీస్ బౌలర్లు పోరాడినప్పటికీ వర్షం కారణంగా మ్యాచ్‌ను కొనసాగించే అవకాశం లేకపోయింది. నాలుగు వికెట్లతో న్యూజిలాండ్ బ్యాటింగ్ పతనంలో కీలక పాత్ర పోషించిన గుర్నూర్ బ్రార్‌కు మ్యాచ్ ఉత్తమ ఆటగాడి పురస్కారం దక్కినట్లు సమాచారం. ఈ విజయంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యాన్ని సాధించింది. మొదటి రెండు మ్యాచ్‌ల్లో విజయాలు అందుకున్న టీమిండియా తదుపరి పోరులోనూ గెలిచి సిరీస్‌పై పట్టు మరింత బిగించాలని భావిస్తోంది.

టెస్టులకు రివర్స్ స్వింగ్ కింగ్ గుడ్‌బై!

- 13 ఏళ్ల సుదీర్ఘప్రస్థానానికి మహమ్మద్ షమీ ముగింపు
- అరంగేట్రం చేసిన రోజునే వీడ్కోలు నిర్ణయం
- 64 టెస్టులు.. 229 వికెట్లు.. ఆరుసార్లు ఐదు వికెట్ల ఘనత
- తొలి టెస్టులోనే తొమ్మిది వికెట్లతో సంచలనం
- వన్డేలు, టీ20లు, ఐపీఎల్, దేశవాళీ క్రికెట్‌లో కొనసాగనున్న పేసర్



కోల్‌కతా, నవంబర్ 7 (సమయం న్యూస్): భారత క్రికెట్‌లో తన పదునైన బంతులతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న స్టార్ పేసర్ మహమ్మద్ షమీ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికినట్లు ప్రకటించాడు. పదమూడేళ్ల సుదీర్ఘ టెస్టు ప్రయాణానికి ముగింపు పలుకుతూ సామాజిక మాధ్యమాల ద్వారా తన నిర్ణయాన్ని వెల్లడించినట్లు సమాచారం. 2013 నవంబర్ 7న వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్ ద్వారా టెస్టుల్లో అరంగేట్రం చేసిన షమీ, సరిగ్గా పదమూడేళ్ల తర్వాత అదే తేదీన ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. టెస్టులకు వీడ్కోలు పలికినప్పటికీ వన్డేలు, టీ20లు, ఐపీఎల్‌తోపాటు దేశవాళీ క్రికెట్‌లో కొనసాగనున్నట్లు తెలిపాడు. 2013 నవంబర్‌లో కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ మైదానంలో వెస్టిండీస్‌తో జరిగిన టెస్టుతో షమీ అంతర్జాతీయ టెస్టు ప్రస్థానం ప్రారంభమైంది. తొలి మ్యాచ్‌లోనే తన బౌలింగ్ ప్రతిభను చాటుకున్నాడు. రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి తొమ్మిది వికెట్లు పడగొట్టి క్రికెట్ ప్రపంచం దృష్టిని ఆకర్షించాడు. పదునైన పేస్ బౌలింగ్, కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్, బంతిని రెండు వైపులా స్వింగ్ చేయగల సామర్థ్యంతో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బందులకు గురిచేశాడు. ముఖ్యంగా పాత బంతితో రివర్స్ స్వింగ్ రాబట్టడంలో షమీ ప్రత్యేక నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. భారత్ తరఫున 64 టెస్టులు ఆడిన షమీ మొత్తం 229 వికెట్లు పడగొట్టాడు. ఆరుసార్లు ఒక ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు సాధించాడు. 27.71 బౌలింగ్ సగటు, 50.2 స్ట్రైక్ రేట్‌తో తన టెస్టు ప్రస్థానాన్ని కొనసాగించాడు. స్వదేశంలో మరింత ప్రభావవంతమైన బౌలర్‌గా నిలిచిన షమీ 22.1 సగటుతో వికెట్లు సాధించాడు. భారత గడ్డపై ప్రతి 42.6 బంతులకు ఒక వికెట్ పడగొట్టిన ఘనత అతడి సొంతం. భారత్ తరఫున అత్యధిక టెస్టు వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో తొలి 15 స్థానాల్లో చోటు సంపాదించాడు. స్వదేశంలోనే కాకుండా విదేశీ పర్యటనల్లోనూ షమీ తన బౌలింగ్‌తో కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా పర్యటనల్లో ప్రత్యర్థి బ్యాటర్లకు సవాల్ విసిరాడు. వేగంతోపాటు రివర్స్ స్వింగ్‌ను సమర్థంగా వినియోగించి కీలక సమయాల్లో వికెట్లు సాధించాడు. 2016లో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లోనూ తన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. భారత పేస్ దళంలో కీలక సభ్యుడిగా ఎన్నో విజయాల్లో భాగస్వామి అయ్యాడు. 2023లో ఆస్ట్రేలియాతో జరిగిన ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ షమీ చివరి టెస్టు మ్యాచ్‌గా నిలిచింది. ఆ తర్వాత గాయాలు, ఫిట్‌నెస్ సమస్యల కారణంగా టెస్టు జట్టుకు దూరమయ్యాడు. తిరిగి జట్టులోకి రావడానికి ప్రయత్నించినప్పటికీ టెస్టు క్రికెట్‌లో మరో అవకాశం దక్కలేదు. చివరకు సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడైంది. టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు సందర్భంగా తన ప్రయాణంలో సహకరించిన కోచ్‌లు, శిక్షకులు, ఫిజియోలు, సహచర ఆటగాళ్లకు షమీ కృతజ్ఞతలు తెలిపినట్లు సమాచారం. ముఖ్యంగా తనపై ప్రేమాభిమానాలు చూపిన క్రికెట్ అభిమానులకు ధన్యవాదాలు తెలియజేశాడు. ఎన్నో గాయాలు, ఒడిదుడుకులు ఎదురైనా భారత జట్టు కోసం మైదానంలో పోరాడిన అనుభవాలను గుర్తుచేసుకున్నాడు. టెస్టు క్రికెట్ నుంచి తప్పుకున్నప్పటికీ షమీ ఇతర ఫార్మాట్లలో కొనసాగనున్నాడు. వన్డేలు, టీ20లతోపాటు ఐపీఎల్, బెంగాల్ తరఫున దేశవాళీ క్రికెట్‌లో ఆడనున్నట్లు తెలిపాడు. తన అనుభవాన్ని వినియోగించుకుని పరిమిత ఓవర్ల క్రికెట్‌లో రాణించాలనే లక్ష్యంతో ఉన్నట్లు సమాచారం. భారత టెస్టు క్రికెట్‌లో పేస్ బౌలింగ్‌కు కొత్త పదును తీసుకొచ్చిన ఆటగాళ్లలో షమీ ఒకడిగా గుర్తింపు పొందాడు. ముఖ్యంగా పాత బంతితో రివర్స్ స్వింగ్ రాబట్టి ప్రత్యర్థి బ్యాటర్లను బోల్తా కొట్టించే అతడి నైపుణ్యం అభిమానులకు గుర్తుండిపోతుంది. పదమూడేళ్ల టెస్టు ప్రయాణంలో 229 వికెట్లతో తనదైన ముద్ర వేసిన షమీ నిర్ణయం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



ఐఓఏ అథ్లెట్ల కమిషన్ చైర్‌పర్సన్‌గా సింధు

దిల్లీ: భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అథ్లెట్ల కమిషన్ నూతన నాయకత్వం ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. స్టార్ షట్లర్ పి.వి.సింధు ఐఓఏ అథ్లెట్ల కమిషన్ చైర్‌పర్సన్‌గా.. భారత పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అగ్రశ్రేణి వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను, స్విమ్మర్ సాజన్ ప్రకాశ్ ఐఓఏ సర్వసభ్య సమావేశానికి అథ్లెట్ల కమిషన్ ప్రతినిధులుగా ఎంపికయ్యారు. ఈ నాలుగు పదవులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో అభ్యర్థులంతా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి సంజయ్ శ్రీవాస్తవ ప్రకటించారు. ఈ నలుగురు క్రీడాకారులు 2026-2030 కాలానికి గాను నాలుగేళ్ల పాటు ఈ బాధ్యతల్లో కొనసాగుతారు. డిసెంబరు 5న ఐఓఏ ఎన్నికల అనంతరం ఏర్పాటయ్యే ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో సింధు, హర్మన్‌ప్రీత్ సభ్యులుగా చేరతారు. ఐఓఏ సర్వసభ్య సమావేశం ప్రతినిధులుగా ఎన్నికైన చాను, సాజన్.. డిసెంబరు 5న జరిగే ఎన్నికల్లో ఓటు వేసే హక్కు కలిగి ఉంటారు. పది మంది సభ్యులతో కూడిన ఐఓఏ అథ్లెట్ల కమిషన్‌లో సలీమా టెటె (హాకీ), స్వప్నిల్ కుసాలె (షూటింగ్), భవానీ దేవి (ఫెన్సింగ్), తజిందర్‌పాల్ సింగ్ తూర్ (షాట్‌పుట్), బొంబేలా దేవి (ఆర్చరీ), మంజీత్‌సింగ్ (కయాకింగ్-కనోయింగ్) సభ్యులుగా ఉన్నారు.



ధోనీని 'మాహీ అంకుల్' అని పిలుస్తా: నటి అనుష్క సేన్

కెప్టెన్' కూల్ ఎంఎస్ ధోనీకి ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. ఆయనను ఒక్కసారైనా నేరుగా చూడాలని ఎంతోమంది ఆశపడుతారు. అలాంటి ధోనీతో తనకు చిన్ననాటి నుంచి ప్రత్యేక అనుబంధం ఉందని నటి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ అనుష్క సేన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆయనను తాను ప్రేమగా 'మాహీ అంకుల్' అని పిలుస్తానని.. ధోనీ తనను చిక్కీ అని అంటారని తెలిపారు. గతంలో ధోనీతో కలిసి పలు వాణిజ్య ప్రకటనల్లో నటించడం వల్ల తమ మధ్య మంచి అనుబంధం ఏర్పడిందన్నారు. పదేళ్ల క్రితం మొదటిసారి ధోనీని కలిసినప్పటి విషయాలను ఆమె ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తామిద్దరం రాంచీ నుంచే వచ్చామన్నారు. ధోనీతో కలిసి తాను ఏడేళ్లపాటు 21 ప్రకటనల్లో నటించానని తెలిపారు. ఇప్పటికీ ఎక్కడైనా కలిస్తే.. ఆయన ఎంతో ప్రేమగా దగ్గరకు తీసుకుంటారన్నారు. 'యహా మై ఘర్ ఘర్ ఖేలీ' సీరియల్‌తో అనుష్క సేన్ ఏడేళ్లకే తన నటనా ప్రయాణాన్ని ప్రారంభించారు. అనేక వాణిజ్య ప్రకటనల్లో నటించారు. 'బాల్ వీర్'లో మెహర్ పాత్ర ఆమెకు మంచి గుర్తింపు తెచ్చింది. దేవోంకే దేవ్ మహదేవ్, ఝాన్సీ కీ రాణి వంటి వాటిల్లో నటించారు.

ధినిధికి మరో కాంస్యం

దకార్ (సెనెగల్): యూత్ ఒలింపిక్ గేమ్స్‌లో భారత యువ స్విమ్మర్ ధినిధి దేశింగు సరికొత్త చరిత్ర సృష్టించింది. ఒకే ఎడిషన్‌లో రెండు వ్యక్తిగత పతకాలు నెగ్గిన భారత తొలి అథ్లెట్‌గా రికార్డు కెక్కింది. మహిళల 100 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో కాంస్య పతకం గెలిచిన ఈ 16 ఏండ్ల కర్ణాటక అమ్మాయి 200 మీటర్ల పోటీలనూ కాంస్య పతకాన్ని ముద్దాడింది. శుక్రవారం జరిగిన తుదిరేసును ధినిధి 2 నిమిషాల 02.28 సెకండ్లతో మూడో స్థానంతో ముగించింది.





వచ్చిందమ్మా.. మదరాసి రబ్బరు బొమ్మ

సాయి శ్రీనివాస్, నేహా శెట్టి

'బైసన్ నాయుడు'గా ప్రేక్షకుల్ని పలకరించనున్నారు హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్. ఆయన టైటిల్ పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని సాగర్ కె.చంద్ర తెరకెక్కించారు. రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. నేహా శెట్టి కథానాయిక. ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఈ చిత్ర గీతాన్ని విడుదల చేశారు. "మదరాసి రబ్బరు బొమ్మ.." అంటూ సాగిన ఈ మాస్ పాటకి భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చగా.. సురేశ్ గంగుల సాహిత్యమందించారు. నల్గొండ గద్దర్ నర్సన్న, రోహిణి సోరట్ సంయుక్తంగా ఆలపించారు. క్రీడా నేపథ్య అంశాలతో ముడిపడిన ఈ యాక్షన్ డ్రామాలో బెల్లంకొండ శ్రీనివాస్ శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనిపించనున్నారు.



ఇన్‌స్టాగ్రామ్ హ్యాక్..

వ్యక్తిగత కంటెంట్ లీక్‌పై సురేఖా వాణి ఆగ్రహం

టాలీవుడ్ నటి సురేఖా వాణి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై ఆమె తీవ్రంగా స్పందించారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా హ్యాక్ అయిందని తెలిపారు. తన వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను అనుమతి లేకుండా కొందరు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారని ఆమె వెల్లడించారు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో నోట్ పెట్టారు. మీమ్ పేజీలు, మీడియా సంస్థలు, యూట్యూబ్ ఛానళ్లు, వ్యక్తులు ఎవరైనా సరే.. తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆ కంటెంట్‌ను షేర్ చేయడం, రీపోస్ట్ చేయడం తక్షణమే ఆపాలని నటి విజ్ఞప్తి చేశారు. "ఈ కంటెంట్‌ను షేర్ చేస్తున్న ఖాతాలు, వ్యక్తులను గుర్తించి, ఆధారాలను సేకరిస్తాను. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాను" అని హెచ్చరించారు. వ్యూస్, రీచ్, పబ్లిసిటీ కోసం.. ఈ పరిస్థితిని ఎవరూ తమకు అనుకూలంగా మార్చుకోవద్దని కోరారు. తన వ్యక్తిగత గోప్యతను గౌరవించాలని, ఇది చాలా తీవ్రమైన అంశమని ఆమె పేర్కొన్నారు. 2005లో ఇండస్ట్రీకి వచ్చిన సురేఖా వాణి.. ఆ తర్వాత వరుసగా హిట్ సినిమాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. 'భద్ర', 'బొమ్మరిల్లు', 'ఏమాయ చేశావే', 'నాయక్', 'బాద్ షా' వంటి సినిమాలతో మెప్పించారు.



సంక్రాంతికి సందడి

భాషతో సంబంధం లేకుండా కొత్తదనం నిండిన కథల్ని ఎంచుకుంటూ ప్రేక్షకుల్ని అలరించే ప్రయత్నం చేస్తున్నారు కథానాయిక మాళవిక మోహనన్. ఇటీవలే 'సర్దార్ 2' చిత్రంలో నటించారు. ప్రస్తుతం విలక్షణ నటుడు విజయ్ సేతుపతితో కలిసి 'పాకెట్ నోవెల్'తో తెరపై సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు మాళవిక. ఇటీవలే ఈ సినిమాని డిసెంబరులో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలొచ్చాయి. తాజాగా ఈ చిత్ర విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది చిత్రబృందం. ఈ నేపథ్యంలోనే "పేజీలు తిరుగుతున్నాయి.. తేదీ ఖరారైంది. 'పాకెట్ నోవెల్' ఈ సంక్రాంతికి రాబోతోంది!' అనే క్యాప్షన్‌తో ఒక కొత్త పోస్టర్‌ని సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది. ఈ పోస్టర్‌లో విజయ్ సేతుపతి, మాళవిక, రాజ్ బి.శెట్టి తదితరులు.. వాళ్ల మధ్యలో ఒక డబ్బుల బ్యాగ్ కనిపించిన తీరు సినీప్రియుల్ని ఆకట్టుకుంది. త్యాగరాజన్ కుమార రాజా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాని టైలర్ డర్డెన్, కినో ఫిస్ట్ నిర్మాణ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఇందులో రాజ్ బి.శెట్టి ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.





రూ.6 కోట్ల కోసం హనీట్రాప్?

6 కోట్లు ఇవ్వకపోవడంతోనే దాడి?

టాలీవుడ్ హీరోయిన్ దొంగతనం కేసులో ట్విస్ట్

కొచ్చి, నవంబర్ 6 (సమయం న్యూస్): కొచ్చిలో ఒక యువ వైద్యుడిపై జరిగిన భౌతిక దాడి ఘటన కేరళ రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. ఈ దారుణ ఘటన వెనుక టాలీవుడ్లో మత్తు వదలరా సినిమాలో నటించిన నటి వేసిన కిలాడీ స్కెచ్ ఉన్నట్లు పోలీసుల విచారణలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగుచూశాయి. నటి అతుల్య చంద్ర ప్రధాన సూత్రధారిగా, నటుడు బిపిన్ పెరుంపల్లితో కలిసి ఏకంగా రూ. 6 కోట్లు దండుకునేందుకు ప్రయత్నించడం, ఆ తర్వాత బ్లాక్ మెయిల్‌కు పాల్పడటం ఇప్పుడు సర్వత్రా హాట్ టాపిక్‌గా మారింది. అతుల్య చంద్ర బంధువుల అమ్మాయితో సదరు డాక్టర్‌కు సన్నిహిత సంబంధాలు, స్నేహం ఉంది. ఆ పరిచయాన్నే ఆసరాగా చేసుకున్న నటి అతుల్య, నటుడు బిపిన్ పెరుంపల్లి కలిసి డాక్టర్ వద్ద నుంచి భారీగా డబ్బు గుంజాలని ప్లాన్ వేశారు. ఇద్దరి మధ్య ఉన్న ఒక వివాదాన్ని పరిష్కరిస్తామని నమ్మబలికి ఫ్లాట్ కి రప్పించుకుని అనంతరం, డాక్టర్‌ను ఏకంగా రూ. 6 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే, అంత భారీ మొత్తం తన వద్ద లేదని, తానివ్వలేనని డాక్టర్ తేల్చి చెప్పడంతో ఈ ముఠా తమ అసలు స్వరూపాన్ని బయటపెట్టింది. డాక్టర్‌కు సంబంధించిన అత్యంత వ్యక్తిగత వీడియో ఫుటేజ్, ప్రైవేట్ వాట్సాప్ చాట్స్‌ను సోషల్ మీడియాలో లీక్ చేస్తామంటూ తీవ్ర స్థాయిలో బెదిరింపులకు దిగింది. వారి బ్లాక్ మెయిల్‌కు కూడా ఆ డాక్టర్ లొంగకపోవడంతో, పక్కా ప్లాన్ ప్రకారం అతనిపై అత్యంత దారుణంగా దాడికి పాల్పడ్డారు. ఈ మొత్తం వ్యవహారం చూస్తుంటే, పక్కా పథకం ప్రకారం డాక్టర్‌ను 'హనీట్రాప్' చేశారా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసుకు సంబంధించి త్వరలోనే అతుల్య బంధువు వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేయనున్నారు. ఇక ఈ కేసులో పాల్గొన్న నిందితులకు పక్కా క్రిమినల్ బ్యాక్ గ్రౌండ్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నటుడు బిపిన్ పెరుంపల్లి డ్రైవర్‌గా పనిచేస్తున్న వ్యక్తిపై గతంలోనే ఎన్‌డీపీఎస్ (డ్రగ్స్) కేసులతో సహా దాడులకు పాల్పడిన సుమారు 8 క్రిమినల్ కేసులు నమోదై ఉన్నట్లు తేలింది. ప్రస్తుతం పరారీలో ఉన్న మరో నిందితుడైన జిమ్ ట్రైనర్ వద్ద డాక్టర్‌కు సంబంధించిన మొబైల్ ఫోన్లు (వ్యక్తిగత డేటా ఉన్న ఫోన్లు) ఉన్నాయని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు, ఈ సెలబ్రిటీల ముఠా వెనుక ఉన్న చీకటి కోణాలను వెలికితీసే పనిలో ఉన్నారు.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**